***Dharma Praveshamlo Nirbhandham Ledhu (Telugu)***

# ధర్మప్రవేశంలో నిర్బంధం లేదు

సంకలనం

**అబుల్ ఫౌజాన్**

M.A. *(Islamic Std.)*, M.A. *(Urdu)*

TRUST

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583



***Dharma Praveshamlo Nirbhandham Ledhu (Telugu)***

**TIP Series No.** : **220**

Compiled by : Abul Fouzan
M.A. *(Islamic Std.)*, M.A. *(Urdu)*

All Rights Reserved with Publishers

First Edition : January 2009

Copies : 2000

**Price** : **Rs. 25**

ISBN : 978-81-88241-71-2

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయ సూచిక


| | |
|---|---|
| 1. విషయ పరిచయం | 04 |
| 2. బలవంతపు మత మార్పిడి- ఇస్లాం | 07 |
| 3. ఇస్లాంలో యుద్ధానికి లక్ష్యం ఏమిటి? | 23 |
| 4. ధార్మిక స్వాతంత్ర్యం | 43 |




# విషయ పరిచయం

స్తుతిస్తోత్రాలు, ప్రశంసలు, కృతజ్ఞతలన్నీ అల్లాహ్‌కే. ఆయన ద్వారా పంపబడిన దైవప్రవక్తలందరిపై ఆయన కరుణ కటాక్షాలు కురియుగాక!

ఇస్లాం ఉద్భవనంతోపాటే, ధర్మవిహీనులకు, మార్గభ్రష్టులకు దానితో వైరం ఏర్పడింది. ఇస్లామీయ ధర్మం మక్కా నుండి ప్రారంభమయింది. మక్కావాసులు పూర్తిగా ధార్మిక భ్రష్టులు. పదమూడేళ్ళ వరకు మక్కా నగరంలో ప్రవక్త మహనీయుల్ని (స), ముస్లింలను వారు యాతనలకు గురిచేయటమేగాక వారిని తమ ఇళ్ళు వాకిళ్ళు, స్వగ్రామం, స్వదేశం కూడా విడిచిపెట్టేందుకు వివశులుగా చేశారు. అంతటితో ఆగక, దైవప్రవక్త (స), ముస్లింలు 'మదీనా'తరలిపోయిన తర్వాత కూడా వారిపై దాడిచేసి వారి నామరూపాల్లేకుండా చేసే విశ్వప్రయత్నాలు చేశారు. మదీనా చుట్టుప్రక్కల్లో యూదుల గ్రామాలుండేవి. వారు కూడా ఇస్లాంకు వ్యతిరేకులుగా మారిపోయారు. ఆ తరువాత కాలంలో ఇరాన్, రోమన్ సామ్రాజ్యాలు కూడా ఇస్లాంకు వ్యతిరేకంగా నిలబడ్డాయి. ఈ అవాంతరాలన్నిటిని అధిగమించి ఇస్లాం ఎప్పుడైతే ఐరోపాలో ప్రవేశించిందో, క్రైస్తవులు ఇస్లాంకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం ప్రారంభించారు. ఆంగ్లేయులు భారత దేశంలో తమ రాజ్యాన్ని స్థాపించిన తరువాత ఇక్కడ కూడా ఇస్లాంకు వ్యతి రేకంగా అపోహల్ని, వ్యాపింపజేసే ప్రయత్నాలు జరిగాయి. భారతీయుల్లో స్వామిదయానంద్ లాంటి ధార్మికులు, యదునాథ్ సర్కార్, హరిప్రసాద్ శాస్త్రి లాంటి చరిత్ర కారులు ఇస్లాం వ్యతిరేక భ్రష్ట సాహిత్యాన్ని పరిచయం చేశారు.

ఇస్లాం వ్యతిరేకులు అనేక విషయాల్లో ఇస్లాంను అప్రతిష్ఠ పాల్జేయాలని ప్రయత్నించారు. ప్రత్యేకించి 'జిహాద్', 'జిజ్‌యా'లను తీవ్రంగా విమ

ర్శించారు. ఇస్లాం ముస్లిమేతరుల్ని బలవంతంగా, దౌర్జన్యంగా ముస్లింలుగా మార్చాలని ఆదేశిస్తుందనే అపవాదును దానికి అంటగట్టారు. అంతేకాక బలవంతంగా, బలాత్కారంగా మాత్రమే ఇస్లాం వ్యాపించిందని, ముస్లిమేత రులపై 'జిజ్‌యా' విధించటానికి కారణం కూడా శిస్తు భారంతో ముస్లిమేత రులు వివశులై ఇస్లాం స్వీకరించాలనేదే ముఖ్య ఉద్దేశమని శతవిధాలుగా నమ్మించ ప్రయత్నం చేశారు.

'జిహాద్', 'జిజ్‌యా'ల వాస్తవికత ఏమిటి? ఇస్లామ్ వ్యతి రేకులు ఇస్లాంకు వ్యతిరేకంగా చేసే దుష్ప్రచారం ఎంతటి భ్రష్టమైనదీ, ద్వేష పూరితమై నదీ, నిరాధారమైనదో ఈ పుస్తకం ద్వారా తేటతెల్లమవుతుంది.

ఈ శీర్షికపై ఇంతకు ముందు స్వర్గీయ మౌలానా అబూ ముహమ్మద్ ఇమాముద్దీన్, రాంనగరి ఒక చిరుపుస్తకాన్ని 'ఇస్లాం మే బలాత్ ధర్మ్ పరివర్తన్ నహీ' అనే పేరుతో దాదాపు (60) సంవత్సరాల క్రితం 1945లో మొదటిసారిగా హిందీ భాషలో వెలువరించారు. ఆ పుస్తకాన్ని ఆధారంగా చేసుకొని, ఇంకా ఇటీవల కాలంలో బయల్పడిన నూతన చారిత్రక సాక్ష్యాధారాలను, ఆధునిక చరిత్రకారుల వాంగ్మూలాలను జోడించి, ఈ అంశంపై ఒక సమగ్రమైన పుస్త కాన్ని రూపొందించాలని తలంపు వచ్చినందున, ఆ ఆలోచనకు రూపకల్ప నయే మీ చేతుల్లోనున్న ఈ పుస్తకం.

బలవంతపు మత మార్పిడి, ధార్మిక స్వేచ్ఛ, ఇస్లాంలో జిహాద్ లక్ష్యం 'జిజ్‌యా'ల వాస్తవికత ఏమిటో తెలుసుకోవటానికి మేము సాధ్యమైనంతవరకు నిష్పక్షపాతులైన ముస్లిమేతర విద్వాంసులు, పండితులు, చరిత్రకారుల సాక్ష్యాధారాలనే పాఠకుల ముందుంచాము.

పై అంశాలకు సంబంధించి, సమగ్ర, సంపూర్ణ సమాచారం కాక పోయినా, ఆ విషయాలను అవగాహన చేసుకోవటానికి కావలసిన కనీస సమా చారాన్ని మాత్రం పొందుపర్చామని భావిస్తున్నాము. ఈ విషయంలోమేమెంత వరకు కృతార్థులయ్యామనే విషయాన్ని పాఠకులే నిర్ణయించగలుగుతారు.



స్వతంత్ర భారతదేశంలో ఇస్లాంకు వ్యతిరేకంగా, ద్వేషపూరితంగా జరిగిన దుష్ప్రచారాన్ని నివారించటం దేశశ్రేయస్సు దృష్ట్యా ఎంతో అవసరం. తద్వారా హిందూ-ముస్లిం సముదాయాల్లో సమైక్యత ఏర్పడి ఈ రెండు మతాల వారు కలిసిమెలిసి అధర్మాన్ని, అనైతికతను, నాస్తికత్వాన్ని, ఫ్యాషన్ పేరిట ఉధృతంగా వస్తోన్న అశ్లీలాన్ని, పాశ్చాత్య సంస్కృతిని ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా మనదేశ ప్రత్యేకత అయిన 'ధార్మికతను' కాపాడు కుంటూ దేశ సమైక్యత, ఔన్నత్యం కోసం కృషి చేయగలం.

**- అబుల్ ఫౌజన్**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 1. బలవంతపు మత మార్పిడి - ఇస్లామ్

మొట్టమొదటిసారిగా ఇస్లామ్‌కు రెండు మత సముదాయాలైన యూదులు, క్రైస్తవులతో సంబంధం ఏర్పడింది. మదీనా పరిసర ప్రాంతాల్లో యూదుల పెద్దపెద్ద బస్తీలుండేవి. అంతేకాక మదీనా నగరంపై కూడా వారు అత్యంత ప్రభావం కలిగి ఉండేవారు. ఇక క్రైస్తవుల సువిశాల సామ్రాజ్యం మదీనా పరిసరాల వరకు వ్యాపించి ఉండేది. దాని ప్రభావంతో లక్షలాది అరబ్బులు క్రైస్తవాన్ని స్వీకరించి ఉన్నారు. దాని సరిహద్దు ప్రాంతాల్లో కొన్ని క్రైస్తవ అరబ్బు రాజ్యాలు కూడా ఏర్పడి ఉన్నాయి. యమన్‌లోని 'నజరాన్' అనేది క్రైస్తవులకు కేంద్రం.

యూదులు, క్రైస్తవులు నిజంగానే తమ తమ ధర్మాలను నిజాయితీతో అవలంభిస్తూ, తమ తమ ధార్మిక గ్రంథాలను తు.చ. తప్పకుండా పాటించి ఉండి ఉన్నట్లయితే, వారు ముస్లింలుగా మారిపోయి ఉండేవారు. దీనికి కారణం, ఇస్లామీయ ధార్మిక సిద్ధాంతం ప్రకారం, చరిత్ర ప్రకారం, ప్రపంచం లోని వివిధ దేశాల్లో, వివిధ జాతుల్లో ఉద్భవించిన ప్రవక్తలు, దైవసందేశ హరులందరూ కూడా వారి జాతులకు ఇస్లామీయ బోధనల్నే గరపడం. వారు ఈ పద్ధతిలోనే మార్గదర్శనం చేశారు. మహనీయ మూసా (అలై) (మోజెస్), మహనీయ ఈసా (అలై) (ఏసుక్రీస్తు) ఈ ప్రవక్తల పరంపరలోని వారే. అయితే జరిగిన ఘోరమేమిటంటే యూదుల్లోగాని, క్రైస్తవుల్లోగాని ఏ ఒక్క వర్గం కూడా



వారి ప్రవక్తలు బోధించిన బోధనలపై స్థిరంగా నిలబడలేకపోయారు. యూదులు తౌరాత్ (Torah-old testement), క్రైస్తవులు ఇంజీల్ (Bible-New testement) గ్రంథాల్లో మార్పులు-చేర్పులకు కూడా పాల్పడ్డారు. తద్వారా వాటిని తమ ఇష్టానుసారంగా మలుచుకున్నారు.

ఇస్లాం తన సిద్ధాంతాన్ని అనుసరించి యూదుల తౌరాత్‌ను, క్రైస్తవుల ఇంజీల్‌ను ఈశ్వర ప్రసాదితమైనవిగాను, మహనీయ మూసా (అలై) మరియు మహనీయ ఈసా (అలై) (ఏసుక్రీస్తు) (వారిపై దైవకారుణ్యం వర్షించుగాక)ను దైవం ద్వారా పంపబడిన నిజమైన సందేశహరులని స్వీకరించింది. దానితో పాటే యూద, క్రైస్తవ విద్వాంసులు తమ స్వార్థం కోసం తమతమ గ్రంథాల్లో చేసిన హస్తక్షేపాన్ని, చేర్పులు-మార్పుల్ని బాహాటంగా ఎత్తి చూపింది. ఈ రకంగా యూద, క్రైస్తవ విద్వాంసుల బండారం బయటపడింది. ఫలితంగా వారి కాల్పనిక ఔన్నత్యం మంట గలిసింది. వారి రాబడి ఆగి పోయింది. వారి ఐశ్వర్యంతో కూడిన జీవితానికి గండిపడినట్లయింది. ఈ విధంగా యూద, క్రైస్తవ మతనాయకులు ఇస్లాం విరోధులుగా మారడం అనివార్యమే అయింది.

యూద, క్రైస్తవ విద్వాంసులు, ధార్మిక గురువులు, దైవం ద్వారా ఆదేశించబడిన నియమాల్ని, చట్టాల్ని, ఆమోదిత నిషేధిత ఆజ్ఞల్ని తుంగలో తొక్కి, దేవుని పేరు మీద తమ వాంఛల్ని, తమ కోరికల్ని దైవాదేశాలుగా ప్రజల ముందుకు తెచ్చారు. ఖుర్ఆన్ ఈ రెండు మతాల భ్రష్టాచారాన్ని ఈ విధంగా ఎత్తిచూపింది:

> **"విశ్వసించిన ప్రజలారా! ఈ గ్రంథ ప్రజల (యూదుల, క్రైస్తవుల) పండితులు, సన్యాసుల స్థితి ఎలాంటిదంటే, వారు ప్రజల సొమ్మును అక్రమ పద్ధతుల ద్వారా తినేస్తారు. వారిని అల్లాహ్ మార్గం అనుసరించకుండా అడ్డుకుంటారు." (అత్ తౌబా-34)**

నేటి కాలంలో లాగానే, ఆ రోజుల్లో కూడా యూదులు గొప్ప ధన వంతులుగా ఉండేవారు. వడ్డీ వ్యాపారం, మోసం, కపటం, అత్యాచారం మున్నగు పద్ధతుల ద్వారా ధనాన్ని ప్రోది చేసుకోవడానికి విశ్వప్రయత్నాలు

చేస్తుండేవారు. వాస్తవానికి వారి ధర్మంలో వడ్డీ తీసుకోవడం పూర్తిగా నిషేధితమై ఉండింది. ఈ విషయంలో ఖుర్‌ఆన్ ఇలా అంటుంది.

> **"(యూదులు) వారికి నిషేధించబడిన వడ్డీని తీసుకుంటున్నందువల్లా, అధర్మంగా ఇతరుల సొమ్మును కబళిస్తున్నందువల్లా, మేము వారి కొరకు పూర్వం ధర్మసమ్మతమైన ఎన్నో పరిశుద్ధమైన వస్తువులను నిషిద్ధాలుగా చేశాము." (అన్‌నిసా-161)**

తౌరాత్, ఇంజీల్ (బైబిల్ గ్రంథం)లలో మహనీయ ముహమ్మద్ (స) గురించి పూర్తి వివరాలున్నాయి. ఆ గ్రంథాల్లో ఆయన (స)కు సంబంధించిన పూర్తి పరిచయం ఉంది. ఈ ధార్మిక గ్రంథాల పండితులు, విద్వాంసులు ఈ విషయాన్ని బాగా ఎరిగినవారే. చివరి ప్రవక్త తమ జాతిలోనే ఉద్భవిస్తాడని వారు ఆశించారు. ఆయన గురించి నిరీక్షిస్తున్నారు కూడా. కాని ఎప్పుడైతే ఆయన (స) గారు వేరే జాతిలో, వేరే వంశంలో జన్మించారో, ఈ యూదులు, క్రైస్తవులు ఆయన (స)కు విరోధులుగా మారారు. ఈ విషయంలో దివ్యఖుర్‌ఆన్‌లో ఒక చోట ఇలా పేర్కొనడం జరిగింది.

> **"మేము ఎవరికి గ్రంథం ప్రసాదించామో, వారు (తమ గ్రంథాల ద్వారా) తమ సంతానాన్ని ఏ విధంగా గుర్తిస్తారో, అదే విధంగా (ఖిబ్లాగా నియమింపబడిన) ఈ స్థలాన్ని గుర్తిస్తారు. కాని వారిలోని ఒక వర్గం బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చుతోంది." (అల్‌బఖర-146)**

అయితే వారిలోనే, ఎవరయితే సత్యాన్వేషకులై ఉన్నారో, వారు వెంటనే దైవప్రవక్త (స)ను, ఖుర్‌ఆన్‌ను విశ్వసించారు. వీరి సందర్భంలోనే ఖుర్‌ఆన్‌లో ఇలా చెప్పటం జరిగింది.

> **"ప్రవక్తపై అవతరించిన ఈ గ్రంథాన్ని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళు అశ్రువులతో చెమ్మగిల్లడం నీవు చూస్తావు." (అల్‌మాయిద-83)**



యూదులు ఇస్లాంను నష్టపరచడానికి రకరకాల ఎత్తుగడలను, కుట్రల్ని పన్నేవారు. ఖుర్‌ఆన్‌లో ఇలా చెప్పడం జరిగింది.

> **"గ్రంథ ప్రజలలోని ఒక వర్గం ఇలా అంటుంది. 'ఈ ప్రవక్తను విశ్వసించిన వారిపై అవతరించిన దాన్ని ఉదయం విశ్వసించండి. సాయంత్రం తిరస్కరించండి. బహుశా ఈ ఉపాయం వల్ల వారు తమ విశ్వాసాల నుండి వెనక్కి మరలవచ్చు."**
> **(ఆలి ఇమ్రాన్-72)**

యూదులు గొప్ప ధనికులై ఉన్నప్పటికీ, వారి వద్ద ఓ పెద్ద రాజ్యమూ లేదు, గొప్ప సైనిక శక్తి ఏదీ లేదు. అయినప్పటికీ వారు తమ కుటిల నీతితో మదీనాపై మంచి పట్టు గలిగి ఉండేవారు. మహనీయ ఇబ్రాహీమ్ (అలై) గొప్ప ప్రవక్తే కాక, ఇస్లామీయ ధర్మానికి ప్రముఖ నేత కూడాను. ఆయన మక్కా నగరంలో ఏకేశ్వరవాద కేంద్రంగా, 'కాబా' దైవగృహాన్ని నిర్మించారు. కాని ఆయన సంతానం కాలక్రమేణా ఆయన బోధనల్ని మరుగు పర్చేసింది. ఇంకా ఆయన చూపిన సన్మార్గాన్ని వదలి, అనేక దేవతల, దేవుళ్ళ రొంపిలో కూరుకుపోయింది. ఫలితంగా వారు రకరకాల సామాజిక, సాంస్కృతిక మరియు నైతిక రుగ్మతల్లో చిక్కుకుపోయారు. మహనీయ ముహమ్మద్ (స), హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) సంతతికి చెందిన వంశంలో జన్మించారు. ఈ వంశం 'కాబా' దైవగృహానికి పూజారులు, పురోహితులుగా ఉంటూ వస్తోంది. ఆయన (స) గారు ఇలాంటి వాతావరణంలో పుట్టిపెరిగినప్పటికీ, తన పూర్వీకుడు, తన పితామహుడైన మహనీయ ఇబ్రాహీమ్ (అలై) ప్రతిపాదించిన ఏకేశ్వరవాద ధర్మానికి ఉపదేశకుడుగా, ప్రచారకులుగా నిలిచారు. కాని ఆయన (స) గారి వంశంలోని వారే, ఆయన కుటుంబీకులే ఆయన (స)కు బద్ధ వ్యతిరేకులుగా, దేశంలోని వ్యతిరేకులందరికీ నాయకులుగా మారారు. అదే కాకుండా మహనీయ ముహమ్మద్ (స)ను తమ శక్తియుక్తులతో అంతమొందించాలని శతవిధాలుగా ప్రయత్నించసాగారు. మదీనాలోని యూదులు అంతరంగికంగాను, బహిరంగంగాను ఈ ఖురైషీ వర్గీయులతో సంబంధాలను నెలకొల్పుకోవటమేకాక, వారికోసం గూఢచార్యం కూడా చేసేవారు. డబ్బు,

ఆయుధ సంపత్తితో వారికి సదా సహాయం చేస్తుండేవారు. ఇన్నీ చేసినప్పటికీ కూడా, ఇస్లాం తన బలీయమైన విశ్వాసాలు ప్రకృతి సహజమైన సిద్ధాంతాలు, అపూర్వమైన శిక్షణా, సన్మార్గం, మహోన్నతమైన నైతిక ఆదర్శాల కారణంగా దినదినాభివృద్ధి చెందుతూ, శక్తిశాలిగా రూపొందసాగింది. యూదుల శక్తి సన్నగిల్లింది. ఖురైషీయులు పరాజితులయ్యారు. దేశమంతటిలోనూ ఏ ఒక్క ప్రత్యర్థి మిగల్లేదు. అరబ్బు దేశ సరిహద్దుల్ని ఆనుకొనే శక్తివంతమైన రోమన్ సామ్రాజ్యం (Roman Empire) వ్యాపించి ఉండేది. అది ఇస్లాంను అణచడానికి ప్రయత్నించింది. కాని చివరికి అది కూడా ఓటమిని చవిచూడ వలసి వచ్చింది. సిరియా నుండి దాని ఆధిపత్యం సమాప్తమై పోయింది. యూదులకు, క్రైస్తవులకు ధార్మిక కేంద్రమైన పాలస్తీనా, మహనీయ మూసా (అలై), మహనీయ ఏసుక్రీస్తు (వారిపై దైవకారుణ్యం వర్షించుగాక)కు ధార్మికంగా నిజమైన వారసులైన ముస్లింల అధీనంలోకి వచ్చేసింది. అంతేకాక ఈ ఇస్లామ్ ప్రభంజనం ఐరోపా ఖండంలోకి చొచ్చుకు పోయింది.

అసత్య ప్రచారంలో ఐరోపా ఎంత ముందంజలో ఉందో, నేడు మనందరికీ తెలిసిన విషయమే. ఈ కళలో అప్పటి నుండే ప్రావీణ్యం కలిగి ఉంది. ఒక వైపు క్రైస్తవ పరిపాలకులు యుద్ధ మైదానాల్లో తమ ఖడ్గాలతో ముస్లింలను ఎదుర్కొంటుంటే, మరొకవైపు క్రైస్తవ విద్వాంసులు, పండితులు, పాదరీలు ఇస్లాం వ్యతిరేక ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. సామాన్య క్రైస్తవ ప్రజలు ఇస్లామ్ పేరు వినగానే మండిపడాలనేది ఈ విద్వేష ప్రచార ఉద్దేశ్యం. ఈ విధంగా ఇస్లాంకు నిరాధారమైన ఆరోపణలు, నిందలు ఎన్నో అంటగట్టారు. ఇస్లామ్ రక్తపిపాస కలిగిన ధర్మమనే ఆరోపణ అందులో ఒకటి. ముస్లిమేతరుల్ని బలాత్కారంగానైనా సరే ముస్లింలుగా మార్చాలని, నిరాకరించిన వారిని అంతమొందించాలని అది తన అనుయాయులకు ఆదేశిస్తుందని నిరాధారమైన అపవాదును అంటగట్టారు. పోప్‌లు, పాదరీలు, పండితులు, చరిత్రకారులు, సాహిత్యకారులు అందరూ ముక్త కంఠంతో, ఏకధాటిగా, క్రమం తప్పకుండా ఎంతో కాలం నుండి, ఇదే ఆరోపణలు పదేపదే ఎంత విస్తృతంగా, ప్రచారం చేశారంటే ఐరోపా మొత్తం ఈ విద్వేష ప్రచారంతో



అట్టుడికి పోయింది. ఇస్లాం రక్తపాతంతో, హింసా-దౌర్జన్యాలతో కూడుకున్న ధర్మమని, అందులో జాలి, దయ, కనికరాలకు, ప్రేమ, సౌభ్రాతృత్వాలకు, మానవత్వానికి అసలు స్థానమే లేదని క్రైస్తవులు ప్రపంచాన్నంతటిని నమ్మింపజేశారు.

విదేశాల నుండి వచ్చిన ముస్లిం రాజులు అప్పటి భారతీయుల మధ్య జరిగిన ఘర్షణలు ఇస్లాం కోసం జరిగిన యుద్ధాలు ఎంత మాత్రం కావు. పోరాడిన అప్పటి ముస్లిం పరిపాలకులు కేవలం తమ స్వార్థం కోసం, తమ రాజ్యవిస్తరణ కోసం మాత్రమే పోరాడారు. కాని అందులో జరిగిన రక్తపాతాన్ని మాత్రం ఇస్లాం ఖాతాలో జమచేయటం జరిగింది. నిజానికి ఇస్లాంకు ఈ యుద్ధాలతో ఎలాంటి సంబంధమే లేదు.

భారతదేశంలో ముస్లింల పరిపాలనను సమాప్తం చేసి, ఐరోపా నుండి వచ్చిన ఆంగ్లేయులు భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు. వారు తమ ఇతర అస్త్ర శస్త్రాలతో పాటే, తరతరాలుగా ఐరోపాలో చెలామణిలో ఉన్న ఇస్లాం వ్యతిరేక ప్రచారాన్ని కూడా భారతదేశానికి తమతోపాటు తెచ్చారు. ఈ విధంగా క్రమక్రమేణా ఈ విద్వేష ప్రచారం వ్రేళ్ళూనుకొని శాశ్వతంగా ఇక్కడ స్థాపితమైపోయింది. కాని ఈ విషయాల్లోని సత్యాసత్యాలేమిటి? ఈ ప్రచారంలోని వాస్తవికత ఏమిటి? అనే విషయం గురించి తెలుసుకోవటానికి ఎవరూ అంతగా ప్రయత్నించలేదు. మహాత్మాగాంధీ, వినోబా భావే, మిసెస్ అనిబిసెంట్, ఎమ్.ఎన్.రాయ్, స్వామి వివేకానంద, డాక్టర్ ఈశ్వర్‌టోపా లాంటి విజ్ఞులు కొందరు అధ్యయనం చేసి, వాస్తవం తెలిపినప్పటికీ, జన సామాన్యం మాత్రం ఈ విద్వేష ప్రచారంలోనే కొట్టుకుపోయారు. ఒక విషయం గురించి తెలుసుకోవాలనుకుంటే, దాని అసలును, మూలాధారాన్ని ఎన్ను కోవాలి. ఇస్లాంకు మూలాధారం, దాని ధార్మిక గ్రంథమైన ఖుర్‌ఆన్. ఒక వ్యక్తిని బలాత్కారంగా ముస్లింగా మార్చమనే ఆదేశం ఖుర్‌ఆన్‌లో ఎక్కడా కని పించదు. దానికి బదులు ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా పేర్కొనబడిన విషయం ఏమిటో చూడండి:

**"ధర్మంలో నిర్బంధం కానీ, బలాత్కారం కాని లేవు. సత్యవాక్కు అసత్యవాక్కు నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది. ఇక నుండి 'తాగూత్'ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించినవాడు సుస్థిర మైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే. (అతడు ఆశ్రయిం చిన) అల్లాహ్ సర్వమూ వింటాడు, సమస్తమూ తెలిసినవాడు."**
**(అల్ బఖర-256)**

ఖుర్‌ఆన్‌లోని పైఆయత్‌ల భావాన్ని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ విధంగా విశ్లేషించారు.

"ధార్మిక విషయంలో ఎలాంటి బలాత్కారానికి ఆస్కారం లేదు. అది హృదయాంతరాళాలలోని, మేధస్సులోని విశ్వాసాలకు సంబంధించిన వ్యవహారం. అందుకని బలాత్కారం, హింసతో విశ్వాసాల్ని సృష్టించడం సాధ్య మయ్యేపనికాదు. నిస్సందేహంగా సన్మార్గమేదో, వక్రమార్గమేదో స్పష్టంగా చూపించటం జరిగింది. ఈ రెండు మార్గాలు, రెండు పద్ధతులను ప్రజలకు తేటతెల్లం చేయటం జరిగింది. ఈ రెండింటిలో దేన్ని ఎన్నుకోవాలో ఒక వ్యక్తి స్వయంగా నిర్ణయించుకోవాలి. ఎవరయితే మిథ్యా దేవుళ్ళను తిరస్కరించి, ఏకేశ్వరుడ్ని నమ్ముకున్నాడో, నిస్సందేహంగా అతను సాఫల్యం, కళ్యాణాన్ని చేకూర్చే మార్గాన్ని ఎన్నుకున్నాడు. బలిష్ఠమైన కొమ్మను పట్టుకున్నాడు. అది విరిగే కొమ్మకాదు. దాన్నెవరైతే ఆశ్రయించాడో, అతను పడిపోకుండా సురక్షితుడైపోయాడు. నిస్సందేహంగా దేవుడు సర్వం వినగలిగేవాడు, సర్వం ఎరిగినవాడు."

పై ఆయత్‌లకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఏ భావాన్నైతే తెలిపారో, ఇస్లాం ప్రాచీన ఆచార్యులు, ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు కూడా ఇదే అర్థాన్ని, ఇదే భావాన్ని తెలిపారు.

ప్రవక్త మహనీయుల (స) బాబాయి హజ్రత్ అబ్బాస్ (రజి) తనయుడైన హజ్రత్ అబ్దుల్లా (రజి) గొప్ప దివ్యఖుర్‌ఆన్ విద్వాంసులు. ప్రవక్త మహనీయుల (స) కాలంలో జరిగిన సంఘటనను ఆయన ఉల్లేఖించారు.



ఆయనను అనుసరించి ప్రవక్త మహనీయుల కాలంలో అన్సార్లలోని ఒక వ్యక్తి ఇద్దరు కుమారులు క్రైస్తవులయ్యారు. ఆ వ్యక్తి వచ్చి దైవప్రవక్త (స)తో నా ఇద్దరు కుమారులు క్రైస్తవ ధర్మాన్ని వదలడానికి సిద్ధంగా లేరు. నేను వారిని బలవంత పెట్టవచ్చునా? అని అడిగాడు. అప్పుడే, ఆ సందర్భంలోనే పైఆయత్ అవతరించిందని హజ్రత్ అబ్దుల్లా (రజి) తెలిపారు.

అల్లామ ఇబ్నె కసీర్ ప్రఖ్యాత ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతగా పేరుగాంచారు. ఈ ఆయత్‌ను విశ్లేషిస్తూ ఆయనగారు ఇలా వివరించారు:

"ఒక వ్యక్తిని ఇస్లాం అవలంబించమని బలవంతపెట్టకూడదు. ఎందుకంటే అదెంతో స్పష్టంగాను, ప్రస్ఫుటంగాను ఉంది. దాని ఔచిత్యాలు, దాని ప్రమాణాలు, దృష్టాంతాలు ఎంత తేటతెల్లంగా ఉన్నాయంటే ఒక వ్యక్తిని వాటిని స్వీకరించమని ఒత్తిడి చేసే అవసరమే లేదు. దేవుడు ఎవరికైతే సద్బుద్ధిని ప్రసాదిస్తాడో, ఎవరి హృదయ కవాటాలైతే సత్యస్వీకారణకు తెరుచు కుంటాయో, ఎవరికైతే జ్ఞానజ్యోతి ప్రసాదించబడిందో, అతను స్పష్టమైన ప్రమాణాలను, దృష్టాంతాలను చూసి తనే స్వయంగా, సంతోష పూర్వకంగా, నిండు హృదయంతో ఇస్లాంను స్వీకరిస్తాడు. ఇక ఎవరి హృదయాలైతే కరడు గట్టుకు పోయాయో, ఎవరి వినే, చూచే, గ్రహించే శక్తులపై ముద్ర పడిందో, అలాంటి వ్యక్తిని బలాత్కారంగా, హింసాదౌర్జన్యాలతో ఇస్లాంను స్వీకరింప జేయడం అతనికి ఎలాంటి లాభాన్ని చేకూర్చదు."

సత్యాన్ని సత్యమని స్పష్టంగా గ్రహించి కూడా మొండిగా దాన్ని వ్యతిరేకించే వారి హృదయం పైనే ముద్ర, సీలు వేయడం జరుగుతుంది.

ఇమామ్ ఫఖ్రుద్దీన్ రాజీ (రహ) ఒక గొప్ప తత్వవేత్త. పేరుగాంచిన దివ్యఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్త. పైఆయత్ గురించి ఆయన, ప్రాచీన ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన ఆచార్యులైన 'అబూ ముస్లిమ్ అస్ఫహానీ', 'కఫాల్'ల కథనాన్ని ఇలా ఉటంకించారు:

"ధార్మిక కార్యకలాపాలను దైవం బలవంతంగా ఒకరిపై రుద్దలేదు. దానికి భిన్నంగా వాటిని అవలంబించేందుకు స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని

ఒసిగాడు. (అంటే ధర్మాన్ని స్వేచ్ఛా, స్వాతంత్రాలతో, తమ ఇష్టానుసారం మాత్రమే అవలంభించే స్వేచ్ఛా, స్వాతంత్రాన్ని ప్రసాదించాడు అని అర్థం.) ఏకేశ్వరవాదానికి సంబంధించిన ప్రమాణాలు, దృష్టాంతాలు ఎంత హేతు బద్ధంగా, ఎంత మనోరంజకంగా, మరెంత సరైన పద్ధతుల్లో చూపించటం జరిగిందంటే, దాని కొరకు సాకులు వెదకటానికి గాని, తిరస్కరించటానికి గాని ఎలాంటి ఆస్కారమే లేదు. దాన్ని స్వీకరించకుండా ఉండటానికి, దాన్ని తిరస్కరించడానికి ఏ తర్కమూ పనికిరాదు. అయినప్పటికీ ఎవరైనా ఏకేశ్వరుని విశ్వసించటం లేదంటే, ఇక మిగిలిన మార్గమొక్కటే- అది అతడ్ని బల వంతంగా దాన్ని అవలంభింపజేయడం. కాని ఈ పద్ధతి దైవానికి ఆమోద యోగ్యం కాదు. నిషిద్ధమైన పద్ధతి అన్నమాట. అసలు ఈ ప్రపంచంగాని, ప్రపంచ జీవితం గాని ఒక వ్యవధి, ఒక పరీక్షా సమయం మాత్రమే. మానవుల ఆచరణలను రికార్డు చేసే పరీక్షా స్థలి. అటువంటి పరిస్థితుల్లో ఒకరిపై ఒత్తిడి చేసి లేదా బలవంతం చేసి ఒక విశ్వాసాన్ని అవలంభించమని బలాత్కరిస్తే ఆ పరీక్ష ఉద్దేశమే నెరవేరదు. పైన పేర్కొన్న ఆయత్ భావం కూడా అదే.

ఆ తరువాత ఈ విషయానికే సంబంధించి ఖుర్ఆన్‌లోని ఇతర ఆయత్‌లను దృష్టాంతంగా పేర్కొన్నారు. చివరిలో 'ఇమామ్ ఫఖ్రుద్దీన్ రాజి' కూడా పైఆయత్ భావం ఇదేనని ధృవీకరించారు.

ధర్మావలంబనలో బలాత్కారం లేదనే అంశంపై ఇంతవరకు వ్రాసింది చాలనుకుంటాము. అయినప్పటికీ ఈ విషయానికి సంబంధించిన ఖుర్ఆన్ లోని కొన్ని ఆయత్‌లను ఉటంకించటం కూడా సముచితమైనదే.

> **"చూడండి! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి వివేచనా కాంతులు వచ్చేశాయి. కనుక ఇక దృష్టిని వినియోగించుకునే వ్యక్తి తనకు తానే మేలు చేసుకుంటాడు. మరి గ్రుడ్డిగా వ్యవహ రించే వ్యక్తి తానే నష్టపోతాడు. నేను మాత్రం మీకు కావలివాణ్ణి కాను." (అల్ అన్ఆమ్-104)**

మౌలానా అబుల్ కలాం ఆజాద్ పైఆయత్‌ను ఈ విధంగా విశ్లేషిం చారు.



"దైవం తరఫున జ్ఞానం, ప్రమాణాలను, దృష్టాంతాలను తెలిపే వెలుగు మీ కొరకు చేరింది. (అజ్ఞానం మరియు తెలియలేదనే సాకు తొలిగిపోయింది) ఎవరైనా వాటిని అర్థం చేసుకుంటే, స్వయంగా అది అతనికే లాభిస్తుంది. చూసికూడా చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దాని నష్టం కూడా స్వయంగా అతనికే చేకూరుతుంది. '(ఓ ప్రవక్తా! మీరు చెప్పేయండి!) నేను మిమ్మల్ని కనిపెట్టి ఉండేవాడ్ని కాను. (బల వంతంగా మీ కళ్ళు తెరిపించ లేను)."

దివ్యఖుర్ఆన్‌లో ఇంకొక చోట ఇలా చెప్పటం జరిగింది:

> **"ముహమ్మద్! ఇలా చెప్పు: మానవులారా! మీవద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం వచ్చేసింది. ఇప్పుడు ఎవడైనా రుజుమార్గం అవలంభిస్తే అతడి రుజుమార్గం అనుసరణం అతనికే లాభ దాయకం. ఎవడైనా మార్గం తప్పితే అతని ఆ మార్గం తప్పటం అతనికే వినాశకరం. నేను మీకు కావలివాణ్ణి మాత్రం కాను." (యూసుఫ్-108)**

మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారు పైఆయత్‌ను ఇలా వ్యాఖ్యా నించారు.

"ఈ ఆయత్‌లో ప్రకటించిన విషయమే దివ్యఖుర్ఆన్‌లో అనేక చోట్ల పేర్కొనటం జరిగింది. గడచిన ప్రవక్తల బోధనల్ని, ఉపదేశాలను ఎక్కడెక్క డైతే పేర్కొందో, ఆ అన్నిచోట్లా ఇదే ధోరణి ద్యోకతమవుతోంది. అంటే ధర్మావ లంబన అనేది పూర్తి మనస్ఫూర్తిగా జరగాలి. ధార్మిక సందేశం లేక ధర్మావ లంబన అనేది గ్రహించి, అర్థం చేసుకొని పూర్తి ఇష్టంతో అవలంభించే వ్యవ హారం. ఈ విషయంలో ఎలాంటి బలాత్కారానికి గాని, జగడానికి గాని ఆస్కారం లేదు. మీ శ్రేయస్సు కోసం ఒక విషయం ప్రతిపాదించబడింది. మీకు అర్థమైతే, మీకు నచ్చితే స్వీకరించండి. లేకపోతే విడనాడండి. మీకు నచ్చిన త్రోవమీది, నాకు నచ్చిన త్రోవనాది. స్వీకరిస్తారా మీరే లాభపడతారు. నిరాకరిస్తే నష్టపోయేది కూడా మీరే. ప్రతి వ్యక్తి తన ఇష్టానికితానే స్వతంత్రుడు. మంచి మార్గంపై నడిచి లాభాల్ని పొందవచ్చు. చెడుమార్గంపై నడిచి చెడునే

కూడగట్టుకోవచ్చు. ఎవరైనా సన్మార్గంపై నడిస్తే, మరెవరికీ ఎలాంటి లాభంగాని, నష్టంగాని చేకూరదు. అందుకని అతని వెంటపడటం సబబు కాదు. అదే విధంగా ఎవరైనా పెడమార్గం పడితే, దాని ఫలితం అతనే అనుభవిస్తాడు. కనుక వేరొకరు అతన్ని అడ్డగించకూడదు. తమ ఇష్టప్రకారం ఎన్నుకున్న మార్గంపై నడిస్తే, ఆ నడిచిన వాడే దాని మంచి, చెడు ఫలితాలను అనుభవిస్తాడు.

> **"మంచిపని చేసేవాడు తనకు తానే మేలు చేసుకుంటాడు. చెడ్డ పని చేసేవాడు దాని దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడుకాడు.**
> **(హామీమ్ అస్‌సజ్దాహ్:46)**

దీనితోపాటే సత్యం వైపు, సన్మార్గం వైపు, సాఫల్యం వైపు పిలిచే వాని స్థానమేమిటో కూడా తెలుపడం జరిగింది.

"నేనైతే సందేశాన్ని, ఉపదేశాన్ని అందించేవాన్ని మాత్రమే. మీపై పర్యవేక్షకుడ్ని కానేకాదు" అంటే దీని అర్థం హితోపదేశం అందజేయడం మటుకే నా పని. మిమ్మల్ని కనిపెడ్తూ, మిమ్మల్ని పర్యవేక్షిస్తూ, మిమ్మల్ని సన్మార్గానికి మళ్ళించే గుత్తాధిపత్యం నాకు లభించలేదు" అని దైవప్రవక్త ఉటంకించటం జరిగింది.

వేరొకచోట దైవప్రవక్తను ఉద్దేశించి ఇలా అనటం జరిగింది.

> **"మేము నిన్ను వారికి కావలివానిగా నియమించనూ లేదు, నీవు వారికి బాధ్యుడవూ కాదు." (అల్ అన్‌ఆమ్-106)**

ఇంకొక చోట దైవప్రవక్తను సంబోధిస్తూ ఇదే విషయాన్ని ఈ విధంగా తెలుపటం జరిగింది:

> **"వారు ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా, వారిని నీవు సన్మార్గంపై నడిపించి తీరాలని నిన్ను బాధ్యునిగా చేయలేదు, అధికారిగా నియమించనూ లేదు."**



> **"నీవు ప్రజలను విశ్వాసులుగా మారండి అని బలవంతం చేస్తావా?" (యూనుస్:100)**

ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల, విభిన్న పద్ధతుల్లో ఒక దైవప్రవక్త స్థానమేమిటో వివరించటం జరిగింది. ఒక ప్రవక్త సత్యాన్ని, యదార్థాన్ని స్పష్టంగా, దృష్టాంతాలతో ప్రజలకు అందించే వరకే బాధ్యతను కలిగి ఉంటాడు. దైవసందేశాన్ని ఉన్నది ఉన్నట్లుగా అతను చేరవేస్తాడు. ప్రజలకు హితోపదేశం గరపుతాడు. దైవాదేశాల్ని స్వీకరించి సన్మార్గాన్ని అవలంభిస్తే, పరలోకంలో లభించే పుణ్యఫలానికి సంబంధించిన శుభవార్తను వినిపిస్తాడు. దైవధిక్కరణకు పాల్పడి పెడమార్గం పడితే, అనుభవించబోయే శిక్షను గురించి హెచ్చరిస్తాడు. అంతవరకే ఒక ప్రవక్త బాధ్యత కలిగి ఉంటాడు. భువిలో ఉద్భవించిన దైవప్రవక్తలందరూ ఈ పనే నిర్వహించారు. ఇదే విషయాన్ని ఖుర్‌ఆన్ పదేపదే ఉద్ఘాటిస్తోంది.

ఒక్కసారి మీరే ఆలోచించండి! ఇంతకన్నా స్పష్టమైన, శాంతి పూర్వకమైన, శ్రేయస్కరమైన మరియు సహజీవనానికి సంబంధించిన మార్గం, పద్ధతి ఇంకేదైనా ఉందా? సత్యసందేశంలోని ఈ ఆత్మను, ఈ పద్ధతినే గనుక ప్రపంచం అర్థం చేసుకొని ఉంటే, ఒక మనిషి వేరొక మనిషితో కేవలం విశ్వాస ఆచరణల్లో భిన్నత్వం కారణంగా కలహించుకునేవాడా? అయితే మానవునిలోని దౌర్జన్యం, దౌష్ట్యం, ధిక్కారం ఈ సత్యాన్నే స్వీకరించలేకపోయింది. ఇదే సర్వద్వేషాలకు, జగడాలకు, రక్తపాతాలకు మూలకారణంగా మారింది. ఖుర్‌ఆన్, గడచిన ప్రవక్తల అనుచర సముదాయాల ఏ ఏ వృత్తాంతాల్నైతే వివరించిందో, వాటన్నిటిని మరోసారి చదివి చూడండి. ప్రతిచోట ఈ అసహనమే, ఈ ఈర్ష్యాద్వేషమే, ఈ దౌర్జన్యమే ప్రస్ఫుటంగా కనబడుతోంది. దైవం తరఫున పంపబడిన ప్రవక్తలందరూ తాము కేవలం దైవాదేశాలను, సత్యసందేశాన్ని మీకు చేరవేసే వరకే బాధ్యులమని; స్వీకరించటం, స్వీకరించకపోవటం మీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉందని నిర్ద్వందంగా ప్రకటించారు. మేము తెచ్చిన ఈ సత్యసందేశాన్ని స్వీకరిస్తే ఇహపరాల్లో సాఫల్యం పొందుతారని, ఒకవేళ స్వీకరించకపోతే మీరు మీ మార్గంపై నడవండని, తమను

తాము విశ్వసించిన మార్గంపై నడువనియ్యండి, ఫలితం కోసం నిరీక్షిద్దామని మాత్రమే చెప్పారు. అయితే వారిని (ప్రవక్తల్ని) విశ్వసించని వారు మాత్రం మీ మాటను వినం, మిమ్మల్ని మీ మార్గంపైన నడువనియ్యమని దౌర్జన్యం మొదలు పెట్టారు.

ఇస్లాం దాని వ్యతిరేకుల మధ్య ప్రారంభమయిన జగడము కూడా ఇదే. తనది ప్రచార, ఉపదేశ మార్గమని ఖుర్ఆన్ ప్రకటిస్తుంటే, తమది బలాత్కారం, హింసాదౌర్జన్యాల మార్గమని, ఇస్లామ్ వ్యతిరేకులు ఆచరించి మరీ చూపేవారు. నేను చెప్పేది అర్థమైతే స్వీకరించండి, మీకు రుచించకపోతే, స్వీకరించకండి. దాన్ని విశ్వసించిన వారిని ఆ మార్గంపై నడువ నీయండి అని ఖుర్ఆన్ ప్రతిపాదిస్తే, దాని వ్యతిరేకులు, మా మాట మీకు అర్థం అయినా, కాకపోయినా మీరు మాత్రం మేము చెప్పేది వినాల్సిందే, లేదంటే బలాత్కారంగా ఒప్పించడం జరుగుతుంది అనేవారు.

వాస్తవం ఏమిటంటే ఖుర్ఆన్ ఈ ఆయత్ ద్వారా, ఇంకా ఇదే అర్థాన్నిచ్చే ఇతర ఆయత్‌ల ద్వారా ఏ సూత్రాన్నైతే ప్రతిపాదించిందో, ఏ విషయాన్నైతే నొక్కి చెప్పిందో, ప్రపంచమే కనుక దీన్ని అర్థం చేసుకొని ఉంటే, మానవ జాతిలో విశ్వాస ఆచరణల భిన్నత్వం కారణంగా చెలరేగిన సర్వ రక్తపాతాలు, జగడాలు, యుద్ధాలు సమాప్తమైపోయేవి. అంతేకాదు, నేటి ఈ ఆధునిక యుగంలో కూడా అన్ని రకాల యుద్ధాలకు, రక్తపాతాలకు ఈ అసహనమే మూలకారణం. నేడు కూడా ఖుర్ఆన్ ప్రతిపాదించిన ఈ సూత్రాన్నే గనుక అవలంభిస్తే, ఈ వైషమ్యాలన్నీ ఇట్టే సమసిపోతాయి. ఒక్కసారి ప్రశాంత హృదయంతో మీరే ఆలోచించండి! శాంతి పూర్వకంగా ప్రచారం చేయడం లోను, హింసా దౌర్జన్యాలతో ఒప్పించడంలోను గల బేధాన్ని ప్రజలు గుర్తించడం లేదు. ఈ రెండింటిలో గల బేధాన్ని గుర్తించండి అని ఖుర్ఆన్ చెబుతోంది. శాంతిపూర్వక ప్రచార పద్ధతి ఏమిటంటే దేన్నైతే మీరు మంచి మార్గంగా, సత్యంగా, సాఫల్యం కలిగించే మార్గంగా పొందగలిగారో, ఆ హితోపదేశాన్ని, ఆ సత్యాన్ని ఇతరులకు కూడా చేరవేయండి. అయితే కేవలం ప్రేరణ, ప్రోత్సాహాల వరకే ఆగిపోండి, అంతకన్నా ముందుకు వెళ్ళకండి. అంటే



స్వీకరించడం, స్వీకరించకపోవడమనేది ఇతరుల హక్కు అనే విషయాన్ని మరువకండి. వారిని తప్పకుండా స్వీకరింపజేసే బాధ్యత మీపై లేదు. కర్ర పట్టుకొని స్వీకరిస్తావా? లేదా అని అతనిపై హింసా దౌర్జన్యాలకు పాల్పడడం ఎంతమాత్రం తగదని ఖుర్ఆన్ ప్రబోధిస్తుంది. ప్రజలు సన్మార్గాన్ని, లేక దుర్మార్గాన్ని ఎన్నుకోవడంలో వారిపై మీకు గుత్తాధిపత్యమేదీ ఇవ్వలేదని దైవం స్పష్టం చేస్తున్నాడు. దైవప్రవక్తల బాధ్యత కూడా శాంతిపూర్వక ప్రచారం, ప్రేరణ, ప్రోత్సాహం వరకే పరిమితం చేయబడిందని ఖుర్ఆన్ ఉద్ఘాటిస్తున్నది. తన ద్వారా నియమింపబడిన ప్రవక్తలకే సత్యసందేశాన్ని ప్రచారం, ప్రేరణ, ప్రోత్సాహాల వరకు పరిమితం చేసిన దేవుడు, ఇతర వ్యక్తులకు హింసా దౌర్జన్యాల మార్గం అవలంభించడానికి ఎలా అనుమతిస్తాడు??

నిజానికి మానవుని కర్మకు, కార్యాచరణకు సంబంధించిన ప్రతి రంగంలో 'హద్దు' అనేదే అసలు విషయం. ఈ హద్దులో ఉండడంలోనే మానవుడు సతతం విఫలమయ్యాడు. అంటే ఏ విషయంలో ఎంతవరకు పోవాలో, ఏ హద్దులో ఉండాలో, దాని పరిమితి, పరిధి ఏమిటో అర్థం చేసు కోవటం లోనే భంగపడ్డాడు. అతను దాని హద్దులో, ఆ పరిమితిలో ఉండడానికి ఇష్టపడడు. ఉదాహరణకు మనముందు మనిషికి రెండు హక్కులున్నాయి. ఒకటి ప్రచారం, ప్రేరణ, ప్రోత్సాహపు హక్కు అయితే, రెండవది ఇష్టపడడం లేదా స్వీకరించడమనే హక్కు. ప్రతి మనిషికి తాను దేన్నైతే సక్రమమైనదీ, నిజమైనదీ అనుకుంటాడో, దాన్ని ఇతరులకు కూడా తెలిపే హక్కుంటుంది. అయితే ఇతరుల హక్కును కాలరాయడానికి, తృణీకరించటానికి అతనికి హక్కు, అధికారం లేదు. అంటే ఒక విషయాన్ని స్వీకరించే, స్వీకరించకపోయే హక్కు తనకే విధంగానైతే ఉందో, అదే హక్కు ఇతరులకు కూడా ఉందనే విషయాన్ని అతను ధిక్కరిస్తున్నాడన్నమాట. ఇంకా ప్రతి వ్యక్తి తనకుతానే, తన కర్మలకు మాత్రమే బాధ్యుడు తప్ప, ఇతరుల బాధ్యత అతనిపై లేదు.

మేమిక్కడ దేన్నైతే హక్కు అని, సత్యమని చెబుతూ వచ్చామో, ఖుర్ఆన్ దాన్ని మీ విధి, బాధ్యత అని పేర్కొంటుంది. అంటే దేన్నైతే మీరు సత్యం, యదార్థం అని విశ్వసిస్తున్నారో దాన్ని ఇతరుల వరకు చేరవేయడం,

వారికి తెలియపరచడం మీ విధి, బాధ్యత అని దీని భావం. ఒకవేళ ఈ విధిని, బాధ్యతను నెరవేర్చటంలో మీరు గనుక విఫలులైతే, ప్రళయం రోజు దైవం ముందు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. దైవా గ్రహానికి గురికావలసి ఉంటుంది. అయితే మీ బాధ్యత కేవలం శాంతి పూర్వకంగా తెలపడం, ప్రచారం చేయడం, ప్రేరణ, ప్రోత్సాహాల వరకే పరిమితమైనదనే విషయం మరిచిపోకండి. ఇందులో హింసా దౌర్జన్యాలకు, బలాత్కారానికి ఎలాంటి అవకాశం లేదు. మీకు చేరిన సందేశాన్ని ఇతరులకు చేరవేశారా? లేదా? అనే విషయం మాత్రమే ప్రశ్నించబడుతుంది తప్ప ఇతరులు స్వీకరించారా? లేదా? అనే విషయం గురించి మిమ్మల్ని ప్రశ్నించడం జరగదు. ఇదీ ఖుర్‌ఆన్ ముఖ్యోద్దేశ్యం.

ఒకసారి దీర్ఘంగా ఆలోచించండి. ఖుర్‌ఆన్ ఎంత న్యాయంగా, నిష్పక్ష పాతంగా విషయానికి సంబంధించిన ఈ రెండు కోణాలను సంరక్షించింది! అంతేకాక ఏ విధంగా దాని పరిధుల్ని గీసి చూపించింది. ఒకవైపు ఉపదేశం, అవగాహనల పరంపర తెగిపోకుండా, దాన్ని భూమిపై స్థాపితం చేయడానికి జరుగవలసిన కృషిని శాంతిపూర్వకంగా, ప్రచారం, ప్రేరణ, ప్రోత్సహాల వరకు పరిమితం చేసేస్తే, రెండవ వైపు హింసా దౌర్జన్యాలతో, బలాత్కారంగా మానవుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది. ఈ రెండు హద్దుల్ని ఏర్పాటుచేసి సమతుల్యమైన మధ్యేమార్గాన్ని సూచించింది. ఈ సమతుల్యాన్ని ఏ మాత్రం కదిలించినా, ఈ రెండింటిలో ఏదో ఒక కోణం, దెబ్బతింటుంది, నష్టపోతుంది. సత్యసందేశానికి సంబంధిం చిన ప్రచారం, ప్రోత్సాహం కన్నా ఒక్క అడుగైనా ముందుకేస్తే, అతని ఉనికి, ఆలోచనలకు సంబంధించిన వ్యక్తిగత స్వాతంత్ర్యం మట్టిలో కలిసిపోతుంది. ఇక వ్యక్తిగత స్వాతంత్రం పేరుతో ఇంకొంచెం ముందుకెళ్ళినా, ఇంకాస్త స్వాతంత్రం ఇచ్చినా, సత్య సందేశం, న్యాయవ్యవస్థల ఆవశ్యకత, స్థాపనల్లో



అధిగమించలేని అవరోధం ఏర్పడుతుంది. అంటే సత్యం, న్యాయాల ఆవశ్యకత, స్థాపనల వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతుంది.

ఖుర్‌ఆన్ ప్రతిపాదించిన అనేక విషయాలను అర్థం చేసుకోడానికి ప్రపంచం ఎంతో వ్యవధిని తీసుకున్నట్లే, ఈ విషయాన్ని అర్థం చేసుకోవటంలో కూడా శతాబ్దాల కాలాన్ని వ్యర్థపరిచింది. ఒక మనిషి వేరొక మనిషిని కేవలం విశ్వాసాల భిన్నత్వం కారణంగా వధించ కూడదని, శాంతిపూర్వక ప్రచారంలో మరియు హింసా దౌర్జన్యాలతో ఒప్పించటంలో గొప్ప భేదముందనే విష యాన్ని ఈనాటికీ గాని ప్రపంచం గుర్తించగలిగింది. దాదాపు నూటయాభై సంవత్సరాల నుండి ఈ విషయాన్ని హేతుబద్ధమైన సూత్రంగా గుర్తించడం మొదలయింది. అమెరికా, ఫ్రాన్స్‌లో ప్రకటించిన మానవ హక్కుల ప్రకటనతో మానవుల ఈ హక్కులు నిర్ధారితమయ్యాయని ప్రపంచం పొరబడుతోంది. అయితే ఈ ప్రకటనకు దాదాపు పన్నెండు శతాబ్దాలకు పూర్వమే ఖుర్‌ఆన్ మానవ హక్కులేమిటి? దాని పరిధులేమిటి? అనే విషయాన్ని నిర్ధారించిందన్న విషయాన్ని ప్రపంచం ఇప్పటికైనా గుర్తిస్తుందా??

*(తర్జుమానుల్ ఖుర్‌ఆన్ భాగం-2, పేజీ 172-174)*

ఈ విషయంలో ఇంత వివరంగాను, ఇంత సుదీర్ఘంగాను చర్చించిన తరువాత, ఇస్లాం ధర్మావలంబనలో ఎలాంటి బలాత్కారానికి అవకాశం లేదనే విషయంలో ఇంకెవరికి కూడా ఎలాంటి అనుమానం మిగిలి ఉండదనే మేము భావిస్తున్నాము.

0 0 0

## 2. ఇస్లాంలో యుద్ధానికి లక్ష్యమేమిటి?

ఇస్లాంలో బలవంతంగా ఒకరిని ముస్లింగా మార్చే అనుమతి లేదనే విషయం గడచిన చర్చల ద్వారా నిరూపితమైపోయింది. అయినా శతాబ్దాలుగా చేసిన విద్వేష ప్రచార ఫలితంగా కొందరి హృదయాల్లో ఇంకా కొన్ని అనుమానాలు, శంకలు ఉండి ఉండవచ్చు. అవేమిటంటే బలవంతంగా ధర్మావలంబన లేనప్పుడు, ఖుర్‌ఆన్‌లో యుద్ధానికి సంబంధించిన ఆదేశాలు ఎందుకు వచ్చాయి? దైవప్రవక్త, ఆయన అనుచరుల కాలంలో ఎందుకు యుద్ధాలు చేయవలసి వచ్చింది? ఇలాంటి ప్రశ్నలు జనించే అవకాశముంది.

బలవంతపు మతమార్పిడులు ఇస్లామ్‌లో లేవు అనే విషయం నిరూపితమయిన తరువాత, ప్రవక్త మహనీయుల కాలంలో జరిగిన యుద్ధాలు ధర్మవ్యాప్తి కోసం జరిగాయని, ప్రజల్ని బలవంతంగా ముస్లింలుగా మార్చడానికి జరిగాయనే అపవాదులకు మూలమే లేకుండాపోయింది. వాస్తవమే ఇదైనప్పుడు అసలీ యుద్ధాలు జరగడానికి కారణం ధర్మవ్యాప్తి కాదని, దానికి వేరే కారణాలు ఉండవచ్చునేది ప్రతి వివేచనాపరుడు ఆలోచించకుండా ఉండలేడు. వాస్తవం కూడా అదే!



ఈ విషయాన్నే చర్చించిన ఇద్దరు ప్రముఖ విద్వాంసుల వాంగ్మూలాలను ఉటంకించడం సమంజసమనుకుంటున్నాము.

భారతదేశ చరిత్రలో ఒక ప్రముఖ స్థానాన్ని పొందిన ఒక ఆంగ్లేయ వనిత, మిసెస్ అనీబిసెంట్, ఒక లెక్చర్‌లో ఈ విషయంపై తన అభిప్రాయాల్ని ఇలా వెల్లడించారు.

"ప్రవక్త ముహమ్మద్ (స) గారు జన్మస్థలాన్ని వదిలి మదీనాకు వచ్చేస్తారు. మదీనా ప్రజలు ఆయన్ను అత్యంతగా ప్రేమించటం, గౌరవించటమే కాక, తమ శాసకునిగా నియమించుకుంటారు. అయితే ఆయన శత్రువులు మక్కా నుండి ఆయన్ను వెంటాడటం మానలేదు. ప్రవక్త మహనీయుల అనుచరుల సంఖ్య అతిస్వల్పం. శత్రువులు అసంఖ్యాకంగా ఉన్నారు. చివరికి రెండు పక్షాల మధ్య యుద్ధం మొదలవుతుంది. ఇది చరిత్రలో బద్ర్ యుద్ధంగా ప్రఖ్యాతిగాంచింది. యుద్ధం మొదలవడానికి ముందు ప్రవక్త మహనీయులు దైవంతో ఇలా మొరపెట్టుకుంటారు. "ఓ ప్రభూ! నేడు ఈ చిన్న సముదాయం సర్వనాశనమైపోతే, ఇక భూమ్మీద నిన్ను నిర్మలంగా ఆరాధించే ఒక్క ప్రాణి మిగలదు. "ఆ తరువాత భీకర సమరం ప్రారంభ మవుతుంది. దైవకృప వల్ల అందులో ప్రవక్త మహనీయులు గెలుపొందుతారు. ఇందులో దైవకృపతో పాటే దైవశక్తి కూడా ఆయనకు తోడవుతుంది. ప్రవక్త మహనీయులు చేసింది ఇదే మొట్టమొదటి యుద్ధం. ఈ యుద్ధాన్ని ఆయన తమ ఆత్మ రక్షణ కోసం చేశారు. ప్రవక్త మహనీయులు సహృదయులు, దయార్ద్రగుణం కలిగినవారు. ఈ కారణంగానే ఆయన శత్రువులు ఆయన్ను "ఆడవారి హృదయం కలిగిన వాడు"గా పరిహసించేవారు. అయితే ఇప్పుడు ఆయన ఒక సామాన్య వ్యక్తి కాదు, తనకు, తన అనుచరగణానికి వ్యతిరేకంగా శత్రువులు చేసిన అకృత్యాలను క్షమించి విడిచిపెట్టటానికి. ఇది ఆయన ప్రవేటు, వ్యక్తిగత వ్యవహారం కాదు. ఆయన ఒక రాజ్యానికి పరిపాలకుడు, ఒక సైన్యానికి సైన్యాధిపతి. అంతేకాక ఆయన్ను విశ్వసించి, ఆయన్ను నమ్ముకున్న ఆయన అనుచరుల హక్కులు కూడా ఆయనపై ఉన్నాయి. ప్రైవేటుగా, వ్యక్తిగత రూపంలో ఆయన తన శత్రువుల తప్పులను, అపరాధాలను క్షమించే రోజులు

మున్ముందు రాబోతున్నాయి. అయితే ప్రస్తుతం ఒక శాసకుని రూపంలో, ఒక పరిపాలకుని బాధ్యతగా వారిని ఆయన దండించకుండా ఉండలేడు. భావోద్రేకాలకులోనై పనిచేసే వ్యక్తిత్వం కాదాయనది. బద్ర్ విజయం తరువాత, కేవలం ఇద్దరు వ్యక్తులకు మరణశిక్ష విధించటం జరిగింది. ఇక పట్టుబడిన శత్రువులతో, అరబ్బు సాంప్రదాయానికి విరుద్ధంగా, ప్రవక్త మహనీయుల ఆదేశానుసారం వారి పట్ల అత్యంత దయ, కనికరాలతో ప్రవర్తించడం జరిగింది. పట్టుబడిన ఈ ఖైదీలకు రొట్టెలు తినిపించి, ముస్లింలు తాము మాత్రం ఖర్జూరాలతో సరిపెట్టుకొనేవారు.''

*(నిజాముల్ మషాయెఖ్ మాసపత్రిక, ఢిల్లీ, జమాదిల్ ఊలా, -1934)*

సుప్రసిద్ధ చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబ్బన్ ఇలా రాస్తున్నారు:

''ప్రకృతి నియమాలను అనుసరించి, ప్రతి మనిషికి హంతకుల ద్వారా సంభవించబోయే ధన, మాన, ప్రాణ నష్టాల నుండి తనను తాను కాపాడుకొనే హక్కుంది. తన శత్రువుల అత్యాచారాలను, దమననీతిని బలశక్తులతో ఎదుర్కొని తగిన గుణపాఠం నేర్పటానికి మరియు ఈ శతృత్వాన్ని సముచిత రీతిలో దాని పర్యవసానం వరకు తీసుకువెళ్ళే అధికారం అందరికీ ఉంది. అరబ్బుల స్వతంత్ర సమాజంలో, ఒక సామాన్య మనిషిగానైతేనేమి, లేక ఒక పౌరుడుగానైతేనేమి, తన మాటను, తన భావనల్ని వ్యక్తీకరించుకునే అవకాశం అందరికీ ఉండేది. అయితే (మహనీయ) ముహమ్మద్‌ను, తన శాంతిపూర్వకమైన, ప్రజలకు మేలును చేకూర్చే సందేశాన్ని ప్రచారం చేయకుండా అడ్డగించడం జరిగింది. ఇది ఆ నగరవాసులు ఆయన పట్ల జరిపిన అన్యాయం. అంతేకాదు, ఈ కారణంగా ఆయన్ను తమ జన్మస్థలం నుండి వెడలగొట్టారు. ఇంకొక స్వతంత్ర జాతి, దాని అంగీకారంతో, మక్కా నుండి వచ్చిన ఈ శరణార్థికి రాజ్యాధిపీఠం అధిరోహించే అవకాశాన్ని కల్పించింది. తత్ఫలితంగా ఇతరులతో సంధి చేసుకోవడానికి, శత్రువుల ఆక్రమణను ఎదుర్కోవడానికి లేదా వారిపై దండెత్తడానికి ఆయనకు సర్వాధికారాలు ప్రాప్తమయ్యాయి.''



వాస్తవంలో ''..... పరిశుద్ధత, నిజమైన ప్రపంచ కళ్యాణమే ముహమ్మద్ (స) ప్రధాన లక్ష్యమై ఉండేదనేది బుద్ధిజ్ఞానాలు కలిగిన ప్రతి నిష్పక్షపాతి అంగీకరించకుండా ఉండలేడు. ఆయన ప్రతిపాదిస్తున్న సూత్రాలను తృణీకరిస్తూ, ఆయన వివరిస్తున్న దృష్టాంతాలను అవహేళన చేస్తూ, ఆయన్ను శారీరకంగా బాధిస్తున్న కరడుగట్టిన ఈ శత్రువుల్ని సహించడం మానవ మాత్రుడైన ఒక ప్రవక్తకు సాధ్యమయ్యే పనికాదు. ఆయన తన వ్యక్తిగత శత్రువులనైతే క్షమించగలడు. కాని దైవానికే శత్రువులుగా మారిన వీరి పట్ల శత్రుత్వం వహించకుండా ఉండలేడు...'' *(ఎజాజుత్తన్‌జీల్-పేజి-450)*

ప్రముఖ ఆంగ్లేయ చరిత్రకారుడు మిస్టర్ థామస్ కార్‌లాయల్ Heroes & Hero Worship ఇలా రాస్తున్నారు:

''(హజ్రత్) ముహమ్మద్ (స) ఇంతవరకు కూడా తన ధర్మాన్ని ప్రచారం చేసుకోవడానికి శాంతిపూర్వకమైన పరిచయం, ప్రసంగం, హితోపదేశాల పద్ధతినే అవలంబించారు. కాని ఈ అత్యాచారులు ఆయన్ను ఆయన స్వదేశం నుండి వెళ్ళగొట్టడమే కాక, స్వయంగా వారి అంతరాత్మ ప్రబోధమే అయినప్పటికీ ఈ సత్యసందేశాన్ని తాము వినిపించుకోకపోవటమే కాక, ఇతరులెవ్వరికీ ఆయన వినిపించరాదని ఆంక్ష విధించారు. ఆ ఆంక్షలను ఆయనగారు పట్టించుకోక పోయేసరికి, వారాయనకు ప్రాణ శత్రువులుగా మారి పోయారు. (ఆయన్ను సమాప్తం చేయటానికి సంసిద్ధులయ్యారు). ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ఒక వీర అరబ్బులా తన ఆత్మరక్షణకు నిర్ణయం చేసుకున్నారు. ...... (ఆ తరువాత) ముహమ్మద్ (స) గారికి పది సంవత్సరాల వరకు యుద్ధం, ఘర్షణలాంటి కఠిన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఆ తరువాత బయల్పడిన పరిణామాలు మనమంతా ఎరిగినవే.''

నిజం చెప్పాలంటే, ఇస్లాం కేవలం దైవారాధన, కొన్ని జాతిపరమైన ఆచార వ్యవహారాల వరకు పరిమితమైన ధర్మం కాదు. ఇదొక సంపూర్ణ జీవన వ్యవస్థ. మీరు తలుచుకుంటే దీన్ని ఏకేశ్వరవాద వ్యవస్థ అని పిలుచుకోవచ్చు. దేవుని ఆదేశాలు, నియమాలపై ఆధారపడిన ఏ వ్యవస్థ అయినా సరే,

అందులో యుద్ధం బలప్రయోగం అనివార్యం, ఆవశ్యకం కాకుండా ఉండ లేవు. బలప్రయోగానికి అనుమతి లేని ఇలాంటి ఏ వ్యవస్థ అయినా బాహ్య శత్రువులతోగాని, అంతరంగిక ద్రోహులతోగాని సురక్షితంగా ఉండజాలదు. అంతేకాక అది తన ఉద్దేశ్యాలను, లక్ష్యాలను కూడా పరిపూర్ణంగా నెరవేర్చ జాలదు. ఏ జీవన వ్యవస్థనైతే స్వయంగా మీరు విశ్వసిస్తారో, దాని గురించే ఆలోచించండి. దానికి తన రక్షణకు అనుమతే గనుక లేకపోతే, అది తన లక్ష్యాలలో సిద్ధాంతాలలో ఎలా సఫలం కాగలుగుతుంది? సఫలం పొందినా కూడా బలం, శక్తి లేకుండా అది స్థిరంగాను, శాశ్వతంగాను మనగలుగు తుందా? లేదు, ముమ్మాటికి లేదు. ఇది అసంభవం.

ఇస్లాం ప్రారంభ కాలంలో గొప్పగొప్ప సంకటాలను, ప్రమాదాలను, దుఃఖాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రవక్త మహనీయులు (స) ఆయన అనుచరులు తాము విశ్వసించిన విశ్వాసాలను, సిద్ధాంతాలను ఆచరిస్తూ, ఇతరులకు శాంతిపూర్వకంగా ఈ సందేశ ప్రచారం చేయడం తప్ప ఇంకేమీ చేసేవారు కాదు. కాని ఈ మాత్రానికే నగరమంతా, దేశమంతా, జాతి అంతా వారికి శత్రువులుగా మారిపోయారు. నెలా, రెండు నెలలు కాదు, సంవత్సరం, రెండు సంవత్సరాలు కాదు, మొత్తంగా పన్నెండు సంవత్స రాల సుదీర్ఘకాలం వరకు ముస్లింలను నిరంతరం నరకయాతనలకు గురి చేశారు. ముస్లింలను అణగద్రొక్కి ఇస్లాంను నామరూపాలు లేకుండా అంతమొందించాలని నిశ్చయించుకున్నారు. చివరికి గత్యంతరం లేక ప్రవక్త మహనీయులు, ఇతర ముస్లింలు తమ జన్మస్థలమైన మక్కాను, తమ సర్వస్వాన్ని వదలిపెట్టి మక్కా నుండి మదీనాకు వలసవెళ్ళారు. ఇంతచేసినా కూడా ముస్లింల పట్ల శత్రుత్వం, అత్యాచారం కొనసాగుతునే ఉంది. తమ అశక్తతవల్ల మదీనాకు వెళ్ళలేక, మక్కాలోనే ఉంటున్నా ముస్లింలపై అత్యాచారాలు ఇంకా పెరిగి పోయాయి. అంతేకాక మక్కా నుండి మదీనా వెళ్ళిపోయిన ముస్లింలపై కూడా దాడులు ప్రారంభించారు. అప్పుడుగాని ముస్లింలకు తమ రక్షణార్థం యుద్ధం చేయటానికి అనుమతి లభించింది.



యుద్ధానికి సంబంధించి అనుమతిస్తూ అవతరించిన మొట్టమొదటి ఆయత్ ఇలా ఉంది:

> **“ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయినవారు, నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్ళ నుండి తరిమివేయ బడినవారు. వారి తప్పు కేవలం, ‘అల్లాహ్ మా ప్రభువు’ అని అనటమే. అల్లాహ్ గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, మసీదులు- వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరింపబడుతుందో- అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్ తనకు సహాయం చేసే వారికి తప్పకుండా సహాయపడతాడు. అల్లాహ్ మహాశక్తి మంతుడు, మహాబలవంతుడూను.” (అల్‌హజ్-39,40)**

పై ఆయత్‌ల భావాన్ని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇలా విశ్లేషించారు.

“‘ఏ ముస్లింలకు వ్యతిరేకంగా దౌర్జన్యకారులు వారిపై అన్యాయంగా యుద్ధం రుద్దారో, వారికి (ముస్లింలకు) కూడా వారిని ఎదుర్కోవటానికి యుద్ధ అనుమతి ఒసగబడుతున్నది. ఎందుకంటే వారిపై అన్యాయం, అత్యాచారం జరిగింది. అంతేకాక దైవం వారిని సహాయపడడానికి సర్వసమర్థుడు. ఈ పీడిత జనులు (ముస్లింలు) ఏలాంటి నేరం లేకుండానే తమ ఇళ్ళ నుండి వెళ్ళ గొట్టబడ్డారు. వారు చేసిన నేరమేమిటి? అల్లాహ్ ఒక్కడే మా ప్రభువు అని పలకటమే వారి నేరమా? ఇంకా, దైవం కొందరు ప్రజల ద్వారా కొందరు ప్రజల్ని రక్షించి ఉండకపోతే (అంటే ఒక వర్గానికి, వేరొక వర్గంపై నిరాటంకంగా అత్యాచారం జరిపే అవకాశమే ఇచ్చి ఉన్నట్లయితే) ఏ జాతి ఆరాధ నాల యాలు కూడా భూమిపై సురక్షితంగా ఉండలేకపోయేవి. అత్యధికంగా

దైవనామం స్మరింపబడే ఆశ్రమాలు, మఠాలు, చర్చీలు, మస్జిద్‌లు, ఇతర ఆరాధనాలయాలు ఎప్పుడో ధ్వంసం చేయబడి ఉండేవి. ఎవరయితే దైవం ద్వారా పంపబడిన సత్యాన్ని పరిరక్షిస్తారో, దైవం కూడా వారిని పరిరక్షిస్తాడనే విషయాన్ని మరువకండి. నిస్సందేహంగా ఆయన ప్రబలుడు, అందరినీ వశపరుచుకొనే శక్తిసామర్థ్యాలు గలవాడు.''

> **"వీరికి (ముస్లింలకు) భూమిపై మేము అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజును స్థాపిస్తారు, జకాత్‌ను ఇస్తారు, మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు, చెడు నుండి నిరోధిస్తారు. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతుల్లోనే ఉంది." (అల్‌హజ్:41)**

పై ఆయత్‌లను మౌలానా ఆజాద్‌గారు ఇలా విశ్లేషించారు.

''తమ రక్షణార్థం ఆయుధాలు ఎత్తుకోవచ్చని ముస్లింలకు అనుమతించటం జరిగింది. యుద్ధాన్ని అనుమతిస్తూ అవతరించిన ఇది (39,40,41) ప్రారంభ ఆయత్‌లు అనే విషయంపై సర్వవిద్వాంసులు ఏకీభవించారు.''

ఇంతకు క్రితం, మక్కా ఖురైషీయులు ముస్లింలను 'హజ్' యాత్ర చేయకుండా నిరోధించి అత్యాచారం జరుపారని, అలా చేయడానికి వారికె లాంటి హక్కులేదని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఇకిప్పుడు యుద్ధానికి అనుమతి ఇవ్వటానికి గల కారణం ఏమిటో స్పష్టపరచడం జరిగింది.

''ముస్లింలు పీడించబడ్డారు. మరియు దౌర్జన్యకారుల నుండి తమను తాము రక్షించుకునే హక్కు పీడిత జనులకుంది. పదమూడు సంవత్సరాల వరకు ఈ పీడితులు, మక్కా ఖురేషీయుల అత్యాచారాల్ని, హింసా దౌర్జన్యాల్ని అనుభవిస్తూ వచ్చారు. చివరికి స్వదేశాన్ని కూడా త్యాగం చేసి వచ్చేశారు. అయితే విదేశంలో, వేరే ప్రాంతంలో కూడా వారిని నిశ్చింతగా కూర్చుండనివ్వ లేదు. వారికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించబడింది. ఇదంతా చేయటానికి వారు చేసిన నేరమేమిటి? కేవలం 'రబ్బునల్లాహ్' (అల్లాహ్‌యే మా దైవం) అనడం ఒక్కటే వారు చేసిన నేరం. మేము మా విశ్వాసాన్ని అనుసరించి మా ప్రభువును స్మరిస్తున్నాము. ఇతరులు మా ధర్మాన్ని తప్పకుండా స్వీకరించాలని



మేము బలాత్కరించడం లేదు. అలాంటప్పుడు ఇతరులు మమ్మల్నెందుకు మా విశ్వాసాల నుండి, మా ధర్మం నుండి వైదొలగాలని ఒత్తిడి చేయడం, బలాత్కరించడం జరుగుతోంది?

ఆ తరువాత దౌర్జన్యాన్ని ఎదుర్కోవటం పీడితుల హక్కని, ఒకవేళ వారికి ఈ ఎదుర్కొనే హక్కును కూడా ఇవ్వకపోతే, ప్రపంచంలో దౌర్జన్యకారులకు, అత్యాచారం చేసేవారికి పట్టపగ్గాలుండవని, ప్రపంచమంతా హింసా దౌర్జన్యాలతో నిండిపోతుందని, దాన్ని ఆపడానికే ఇదో పరిష్కారమని తెలుపడం జరిగింది. అలాకాకపోతే ఏ వర్గం అయినాసరే, తమకు వ్యతిరేక వర్గం వారి విశ్వాస ఆచరణల స్వాతంత్ర్యాన్ని శాశ్వతంగా రూపుమాపుతుంది.

అందుకనే ఇలా ఉపదేశించడం జరిగింది.

''దైవం, ఒక వర్గం ద్వారా, అత్యాచారానికి హింసకు పాల్పడుతున్నా వేరొక వర్గాన్ని అంతమొందించే ఏర్పాటు చేసి ఉన్నాడు. ఒక వర్గం ద్వారా ఇంకొక వర్గాన్ని రక్షించే పరంపరనే కనుక నెలకొలిపి ఉండకపోతే, ప్రపంచంలో దైవనామం, దైవదాస్యాల ఉనికే సమాప్తమైపోయేది. ఏ వర్గపు ఆరాధనాలయాలు కూడా, మానవ అకృత్యాలకు బలికాకుండా సురక్షితంగా ఉండగలిగేవి కావు.''

ఖుర్‌ఆన్‌ను అనుసరించి, ముస్లింలకు అధికారాన్ని, రాజ్యాన్ని ప్రసాదిస్తే వారి కర్తవ్యమేమిటి? ఇలా ఉపదేశించడం జరిగింది. ''ఈ పీడిత ముస్లింలు నిలద్రొక్కుకుంటే వారేం చేస్తారు? అంటే భూమిపై వారికి అధికారాన్ని ప్రసాదిస్తే, దాన్ని వారెలా వినియోగిస్తారు? వారు నమాజ్ వ్యవస్థను స్థాపిస్తారు, జకాత్‌ను చెల్లిస్తారు, మంచిని ఆదేశిస్తారు, చెడు నుండి వారిస్తారు, అత్యాచారం, దుష్కర్మలకు బదులు న్యాయం, సత్కర్మలను ప్రవేశపెడ్తారు. అంటే పుణ్యాల వసంతాన్ని కురిపించే రాజ్యాన్ని స్థాపిస్తారు.''

*(తర్జుమానుల్ ఖుర్‌ఆన్. భాగం-2, పేజీ: 511,512)*

దీన్ని పోలినదే ఇంకో ఖుర్‌ఆన్ ఆయత్ ఉంది. అందులో ఇలా పేర్కొనటం జరిగింది.

**అసలు మీరు, నిస్సహాయులైన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లల కొరకు అల్లాహ్ మార్గంలో పోరాడక పోవటానికి కారణం ఏమిటి? బలహీనులవడం చేత అణచబడి, వారు 'మా ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు నీ తరఫు నుండి ఒక సహాయకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు' అని ఫిర్యాదు చేస్తున్నారే!" (అన్నిసా-75)**

మౌలానా ఆజాద్ గారు పైఆయత్‌ను ఈ విధంగా వ్యాఖ్యానించారు:

"ఇక్కడ ఓ వాస్తవాన్ని గుర్తు చేయడం జరిగింది. ఇతరులపై దాడులు జరుపటానికి, వారిని లొంగదీసుకోవటానికి ముస్లింలకు యుద్ధం అనుమతి ఇవ్వబడలేదు. దానికి బదులు పీడిత జనులను, నిస్సహాయులను ఆదుకోవడానికి వారిని దౌర్జన్యకారుల నుండి విముక్తి కలిగించడానికి మాత్రమే అనుమతి ఇవ్వబడింది. దాని కోసమే అది (ఖుర్ఆన్) పదేపదే 'అల్లాహ్ మార్గంలో పోరాడండి' అని హెచ్చరిస్తూ ఉంటుంది. అంటే తమ యుద్ధకాంక్ష కోసమో, మనోవాంఛల్ని తీర్చుకోవటానికో యుద్ధం చేయడం కాదు, దానికి బదులు అల్లాహ్ ప్రతిపాదించిన న్యాయవ్యవస్థను స్థాపించడానికే యుద్ధం చేయాలి. *(తర్జుమానుల్ ఖుర్ఆన్-మొదటి భాగం, పేజి.379)*

కొన్ని ముఖ్య ఆయత్‌లను ఏరికోరి, సందర్భం నుండి విడదీసి, ఇస్లాంకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం జరిగింది. ప్రత్యేకించి స్వామి దయానంద వ్రాసిన 'సత్యార్థ ప్రకాశ్', (ఇటీవల కాలంలో ఖుర్ఆన్ (24) ఆయత్‌లపై అభ్యంతరాలు) ద్వారా అపోహల్ని సృష్టించటం జరిగింది. అవిశ్వాసుల్ని (ఇస్లాంను స్వీకరించని వారిని) ఎక్కడ కనబడితే అక్కడ పట్టుకొని వధించండి అని ఖుర్ఆన్ ముస్లింలకు ఆదేశిస్తుందని చెప్పుకొచ్చారు. అయితే ఈ దుష్ప్రచారం వాస్తవికత ఏమిటో, స్పష్టమవటం కూడా ఎంతో ముఖ్యం. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

**"మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించేవారిని అల్లాహ్ ప్రేమించడు.**



**మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడి నుండి పారద్రోలారో, అక్కడి నుండి మీరూ వారిని పారద్రోలండి. చంపటం చెడ్డదే. కాని ఫిత్నా (పీడన) అంతకంటే చెడ్డది. 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చెయ్యనంతవరకు, మీరూ వారితో యుద్ధం చెయ్యకండి. కాని వారే అక్కడ కయ్యానికి కాలుదువ్వితే, మీరు వారిని చంపటానికి వెనుదీయుకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష. వారు యుద్ధం చెయ్యటం మానుకుంటే (మీరూ మానండి) అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూ అనే విషయం తెలుసుకోండి. ఫిత్నా (పీడన) అంతమయ్యేంత వరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తునే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యకారులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." (అల్‌బకర: 190-193)**

యుద్ధానికి సంబంధించిన ప్రత్యేక ఆయత్‌లివి. కనుక ముస్లిమేతర సోదరులు వీటిని  ధ్యానపూర్వకంగా గమనించగలరని మనవి.

ఇక్కడ, ముస్లింలకు అవిశ్వాసులతో, కేవలం వారి అవిశ్వాస కారణంగా యుద్ధం చేసే అనుమతిని ఇవ్వడం లేదు. దానికి భిన్నంగా ఈ అవిశ్వాసులు ఇస్లాం అంటేనే ఓర్వలేకపోయేవారు. వారు ముస్లింల పట్ల కరడుగట్టిన శతృత్వం కలిగివున్నారు. ముస్లింలను నామ రూపాల్లేకుండా అంతమొందించాలని కంకణం కట్టుకున్నారు.

మక్కా అవిశ్వాసులు ప్రవక్త మహనీయుల్ని సత్యధర్మాన్ని (ఇస్లాంను) శాంతిపూర్వకంగా ప్రచారం చేసుకోవడానికి అనుమతించేవారుకాదు. ఆయన్ను అవహేళన చేసేవారు, పవిత్ర కాబాలో నమాజ్ చేసుకోనిచ్చేవారు కాదు. అసత్యప్రచారం చేసి, ప్రజల్ని ఆయన పట్ల విముఖుల్ని చేసేవారు, వారిలో విద్వేషాగ్నిని నింపేవారు. ఫలితంగా వారు ప్రవక్త మహనీయుల్ని, ఆయన అనుచరుల్ని రకరకాలుగా హింసిస్తూ, నరకయాతనలకు గురిచేసేవారు. మక్కా నగరం నుండి ఆయన్ను, ఆయన పరివారాన్ని బహిష్కరించారు. ఈ బహిష్కారం కూడా ఒకటి రెండు రోజులు కాదు, మూడు సంవత్సరాల వరకు కొనసాగింది. ఈ బహిష్కరణలో ఎంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగాయంటే,

ఆహార పదార్థాలుగాని, తినడానికి పనికివచ్చే ఏ వస్తువుగాని వారి వరకు చేరకుండా గట్టి కాపలా కాసేవారు. పిల్లలు ఆకలికి అలమటిస్తుంటే, వీరు వికటాట్టహాసం చేసేవారు. ఆకలి బాధను భరించలేక వారు చెట్ల ఆకులాల ములు ఏరుకొని తినేవారు. అవి కూడా అయిపోయినప్పుడు కడుపు మంటను చల్లార్చుకోవడానికి ఎండిపోయిన తోలు ముక్కల్ని కడిగి కాల్చి తినేవారు. చూడండి, ఆలోచించండి! ఎంత నిర్దయులు ఈ విరోధులు. ఎంత కర్కష హృదయులు ఈ వ్యతిరేకులు? వారి ఉద్దేశమేమిటంటే ఈ బాధలకు జడిసి, ప్రవక్త మహనీయులు తమ సందేశ ప్రచారాన్ని మానుకోవాలి. శత్రువులు ఇలాంటి అకృత్యాలతో ఒకటి రెండు కాదు, పదమూడు సంవత్సరాల వరకు ప్రవక్త (స) మరియు వారి అనుచరులపై అత్యాచారాలు, హింసాదౌర్జన్యాలు జరుపుతునేపోయారు. చివరికి ఆయన్ను హతమార్చడానికి ప్రణాళికను రూపొం దించుకున్నారు. ఒక రోజు రాత్రి నగ్న ఖడ్గాలతో ఆయన ఇంటిని చుట్టు ముట్టి, ఆయన బయటికి రాగానే హతమార్చాలని మాటువేసి కూర్చున్నారు.

ఆయన దైవప్రవక్త. దైవమే ఆయనకు రక్షకుడు. కనుక ఆయన శత్రువుల మధ్య నుండి నిర్భయంగా బయటికి వచ్చి మదీనాకు చేరు కున్నారు. అంతకుముందే ఈ పురవాసులు ఇస్లాంను స్వీకరించి ఉన్నారు. ఇంకా వారి నాయకులు ప్రవక్త మహనీయుల్ని తమ వద్దకు రమ్మని ఆహ్వానించి ఉన్నారు.

ఇంత జరిగిన తర్వాతనైనా ఆయనశత్రువులు సంతృప్తి చెంది, శాంతించారా? లేదు. వారు మదీనాపై దండెత్తి వచ్చారు. ఈ సందర్భంలోనే, ఇలాంటి శత్రువులతోనే, యుద్ధం చేయాలని పైఆయత్‌ల ద్వారా ఆదేశిం చడం జరిగింది. ఈ ఆదేశాలు అనుచితమైనవా? అసందర్భమైనవా?

ఇలాంటి శత్రువులతో యుద్ధానికి అనుమతినిస్తూ కూడా ముస్లింలను "యుద్ధరంగంలో కూడా మీరు ఎలాంటి అత్యాచారానికి, దౌర్జన్యానికి పాల్పడ రాదని, అన్యాయమైన ఎలాంటి పనికి పాల్పడవద్దని, అత్యాచారం, దౌర్జన్యం చేసేవారంటే దేవుడు ఇష్టపడడని గుర్తుంచుకోండి" అంటూ హెచ్చరించడం జరిగింది.



ఇక్కడ 'అన్యాయం' అనే పదంతో ఇమిడివున్న అర్థాన్ని గ్రహించడం ఎంతో అవసరం. ఈ 'అన్యాయం' అనే పదంలో అనుచితము, అనైతికము మరియు న్యాయానికి విరుద్ధమైన ప్రతి భావం దాగుందనేది మరిచిపోరాదు. వారి ధర్మంలో జోక్యం చేసుకొని, వారి ధర్మాచరణలో ఆటంకం కలిగించని వారితో యుద్ధం చేయడం ముస్లింలకు నిషేధించబడింది. స్త్రీలపై, పిల్లలపై, వృద్ధులపై, క్షతగాత్రులపై, తటస్థంగా ఉండేవారిపై చేయి లేపకూడదు. పొలాలను నాశనం చేయరాదు, పశువుల్ని అనవసరంగా వధించకూడదు. అనివార్యమైనప్పుడు మాత్రమే మీ శారీరక శక్తిని, బలాన్ని ఉపయోగించండి. ఎంతమేరకు అవసరముందో, అంతవరకే ఉపయోగించండి. అంతకు మించి అసలే ఉపయోగించరాదు. ఈ ఆదేశాల ఉద్దేశ్యం, లక్ష్యం ఏమిటంటే అంతకు ముందు అరబ్బువాసులు పైనుదహరించిన అకృత్యాలను, అమానుష కార్యాలను నిస్సంకోచంగా చేస్తుండేవారు.

శత్రువు సంధి- శాంతులను కోరుకోవటమే లేదు. పోరాడటానికే ఉవ్విళ్ళూరుతున్నప్పుడు, ఆ శత్రువును ఎదుర్కోవడం తప్ప వేరే మార్గమే ముంటుంది? అందుకని 'ఎక్కడ కనపడితే అక్కడ అతణ్ణి ఎదుర్కొని పోరా డండి, మిమ్మల్ని అతనెలా వెళ్ళగొట్టాడో, మీరు కూడా అతన్ని అక్కడి నుండి వెళ్ళగొట్టండి' అంటూ ఆదేశించడం జరిగింది.

రక్తపాతం ప్రీతికరమైన కార్యమేమి కాదు. కాని శత్రువు ధార్మిక మార్గంలో అవరోధాలు ఏర్పరుస్తున్నప్పుడు, విద్యా, జ్ఞానం, యుక్తి, తర్కము- వీటన్నిటి ద్వారా తన అభిమతాన్ని, తన వాదాన్ని వినిపించటానికి బదులు హింసా- దౌర్జన్యాలతో, బలవత్‌పూర్వకంగా సత్యమార్గాన్ని అడ్డగించడానికి, ప్రజలపై తమ ఆచారాలను, తమ విశ్వాసాలను అనధికారికంగా, అన్యా యంగా రుద్దడానికి ప్రయత్నించడం హత్యకన్నా ఘోరమైన పాపకార్యం. పైశాచిక చర్య. అందుకని ఇలాంటి అత్యాచారులైన శత్రువులతో యుద్ధం చేయటం శుభప్రదమైనది, కళ్యాణదాయకమైనదీను.

పవిత్ర కాబాలయం పరిసరాల్లో రక్తపాతం నిషేధితం. ఇది అనాది నుండి వస్తున్న ఆచారం. కాని మక్కా అవిశ్వాసులు తమ బలమధాంధ కారంలో కాబాకి గల ఈ పవిత్రతను, ఈ మర్యాదను కూడా తుంగలో తొక్కేశారు. అందుకని పవిత్ర కాబా పరిసరాల్లో మీ అంతట మీరై రక్తపాతాన్ని ప్రారంభించకండి. కాని శత్రువు వినక ఈ మర్యాదను కాపాడకుండా యుద్ధాన్నే గనక ప్రారంభిస్తే, మీరు కూడా వారితో యుద్ధానికి తలపడండని ముస్లింలను ఆదేశించడం జరిగింది.

ఇలాంటి మూర్ఖులు, దుష్టులు అయిన శత్రువుల విషయంలో కూడా, ఒకవేళ వారు యుద్ధాన్ని పరిత్యజిస్తే, దేవుడు అత్యంత క్షమించేవాడు, పరమ దయాళువు అని గుర్తిస్తూ, మీరు కూడా యుద్ధాన్ని ఆపేయండని ముస్లింలను ఉపదేశించడం జరిగింది. ఇలాంటి పవిత్ర శైలిలో ముస్లింలకు అత్యంత ఉన్నతమైన నైతికత్వాన్ని బోధించడం జరిగింది. దీనిభావం ఏమిటంటే క్షమ మరియు దయ దైవంలోని మహోన్నత గుణాలు. కనుక ముస్లింలు కూడా ఈ గుణాలతో శోభాన్వితులు కావాలి. ఒకవేళ ఏ కారణం వల్లనైన శత్రువు యుద్ధాన్ని ఆపేయదలిస్తే, యుద్ధాన్ని పరిత్యజిస్తే, మీరు కూడా యుద్ధాన్ని ఆపేయండని, ప్రతీకారేచ్ఛతో శత్రువును తరమడం, సంహరించడం తగదని ముస్లింలను బోధించడం జరిగింది. మీ అసలు ఉద్దేశ్యం ధర్మమార్గంలో ఏర్పర్చిన అడ్డంకులను, అవరోధాలను తొలగించడం మాత్రమే. అందుకని ఎప్పుడైతే శత్రువు ధర్మమార్గంలో అవరోధాలు సృష్టించకుండా వైదొలుగుతాడో, మీరు కూడా యుద్ధాన్నుండి ఆగిపోవాలి అంటూ ముస్లింలకు హితోపదేశం చేయడం జరిగింది.

చివరలో మరోసారి, మీ ఘర్షణ, మీ యుద్ధానికి ప్రధాన లక్ష్యం ధర్మ మార్గంలో ఏర్పరిచిన అడ్డంకులను, అవరోధాలను తొలగించటమే అయి నప్పుడు, ఆ అడ్డంకులు, అవరోధాలు తొలగిపోయేంతవరకు మాత్రమే మీరు యుద్ధం చేయాలి. ధర్మం ఈశ్వరుని కోసమే ప్రత్యేకమైపోయినప్పుడు, ఆయన భక్తి, ఆరాధనా, ఉపాసనల్లో ఎలాంటి అవరోధం లేకుండా ధర్మమార్గం సుగమమైపోయినప్పుడు, ఆయన ఆజ్ఞపాలన చేయడంలో ఎలాంటి అడ్డం



కులు లేనప్పుడు, మీరు కూడా శాంతించండి. శత్రువు యుద్ధం చేయకుండా ఆగిపోయినప్పుడు మీరు కూడా ఆగిపోండి. యుద్ధ లక్ష్యం అత్యాచారులను ఎదుర్కోవటం మాత్రమే కదా!

ఇక్కడ ముస్లిమేతర సోదరుల్ని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము. చూడండి, గమనించండి, ఆలోచించండి. యుద్ధానికి సంబంధించి ఇలాంటి నీతీ నియమం ఏ ధర్మంలో, ఏ శాస్త్రంలో, ఏ సామాజిక నీతిలోనైనా ఉందా? ఇంతటి పవిత్రమైన, శాంతియుతమైన, నీతినియమాలకు కఠినంగా కట్టుబడి ఉన్న బోధనల్ని వ్యతిరేకులు ఎలా వక్రీకరించారో, ఎలా తారుమారు చేశారో, ఏ దురుద్దేశ్యంతో దుష్ప్రచారం కోసం వినియోగించుకున్నారో మరోసారి గమనించండి.

ఈ విషయానికే సంబంధించిన ఇంకొక ఆయత్ వేరే చోట కూడా వచ్చింది. స్వామిదయానంద్‌జీ గారు ఈ ఆయత్‌పై కూడా ఆక్షేపణ తెలిపారు. ఆ ఆయత్ ఇలా ఉంది:

> **"విశ్వసించిన ప్రజలారా! పీడన ఏమాత్రం మిగలకుండా పోయే వరకు, అల్లాహ్ నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడే వరకు ఈ అవిశ్వాసులతో యుద్ధం చేయండి. తరువాత వారు పీడనను మానుకుంటే అల్లాహ్ వారి కర్మలను తప్పకుండా గమనిస్తాడు. ఒకవేళ వారు మానకపోతే, అల్లాహ్ మీకు సంరక్షకుడు అని తెలుసుకోండి. ఆయన ఉత్తమ రక్షకుడూ, సహాయకుడూను." (అన్‌ఫాల్-39,40)**

పైనుదహరిస్తూ వచ్చిన బకరా అధ్యాయంలోని ఆయత్‌ల లక్ష్యమే మిటో, ఈ ఆయత్ ఉద్దేశ్యం కూడా అదే. అంటే సత్యధర్మాన్ని సంరక్షించడం, ధార్మికమార్గంలో సృష్టించబడిన అడ్డంకులను (పీడనను) తొలగించుటకే తప్ప, ఎలాంటి భౌతిక లాభాల కొరకు ముస్లింలకు యుద్ధం చేసే అనుమతి ఇవ్వబడలేదు.

చివరలో, ముస్లిమేతరులకు సంబంధించి ఇస్లాం సిద్ధాంతమేమిటో తెలుసుకోవటానికి దివ్యఖుర్ఆన్‌లోని రెండు ఆయత్‌లను సమర్పిస్తున్నాము. దీనిద్వారా ముస్లిమేతరుల పట్ల ఎలా మెలగాలో, ఈ విషయంలో ఇస్లాం సిద్ధాంతం ఏమిటో స్పష్టమైపోతుంది.

> **"ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి వెళ్ళగొట్టలేదో, వారి పట్ల మీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిరోధించడు, అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు. ఎవరు మీతో ధర్మం విషయంలో యుద్ధం చేశారో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి బహిష్కరించారో, మిమ్మల్ని బహిష్కరించటంలో పరస్పరం సహకరించుకున్నారో, వారితో మీరు స్నేహం చేయటాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసేవారే దుర్మార్గులు. (అల్ ముమ్‌తహినహ్-8,9)**

ఇస్లాంలో అనుమతించబడిన యుద్ధం మరియు జిహాద్‌ను పట్టుకొని మనదేశంలో ఎంత నిరాధారమైన, హేయమైన, ద్వేషపూరితమైన భ్రష్టప్రచారం జరిగిందో, ఇంకా జరుగుతున్నదో, దాని వాస్తవమేమిటో మేము ఖుర్ఆన్ ద్వారా నిరూపించాము. కనుక ఇంతకు క్రితం జరిగిన, ఇక ముందు జరుగబోయే దుష్ప్రచారం వాస్తవికత ఏమిటి? అనే విషయం తేటతెల్లమైపోయింది. కాబట్టి మన ముస్లిమేతర సోదరులు ఇలాంటి హేయమైన, నీతిబాహ్యమైన, సందర్భాన్నుండి విడదీసి, దురుద్దేశంతో చేస్తున్న విషప్రచారానికి ఏమాత్రం ప్రభావితులుకారని ఆశిస్తున్నాము.

ఈ విషయానికే సంబంధించి న్యాయశీలురు, నిష్పక్షపాతంగల విద్వాంసులు, చరిత్రకారులు వెలిబుచ్చిన అభిప్రాయాల్ని మీ దృష్టికి తీసుకురావటం అసందర్భమేమీ కాదనుకుంటాము.

1. ‘‘ఓ చేతిలో ఖడ్గాన్ని మరో చేతిలో ఖుర్ఆన్‌ని పట్టుకుని ముందుకు సాగే ముస్లిం యోధుని చిత్రం శుద్ధ అవాస్తవం.''

(Islam. by A.S. Tritton-London-1951, p.21)



2. ‘‘మతమౌఢ్యం నిండిన ముస్లింలు తాము జయించిన జాతుల్లో ఇస్లామ్‌ను తమ కత్తి మొనతో బలవంతంగా రుద్దుతూ ప్రపంచమంతటా దూసుకుపోయారన్న గాథలు - చరిత్రకారులు మాటిమాటికీ రాసిన నిరాధారమైన మాయ గాథల్లో అత్యంత విచిత్రమైనవి. ఈ విషయాన్ని చరిత్ర నేడు స్పష్టపరుస్తున్నది.'' (Islam at the Cross Roads, By De lacy O Leary) Londoan-1923. P.8)

3. ‘‘ప్రారంభకాలంలో దాని అనుయాయుల్లోని ప్రత్యేక గుణమైన సైనిక వీరత్వం కన్నా, దానిలోని స్వతంత్ర, సమానత్వపు భావనలే, ఇస్లాం అత్యద్భుత పురోగమనానికి దోహదపడ్డాయి. ఇలాంటి ప్రతి సందర్భంలోను, ముస్లిం సైన్యాలు ఏ క్రైస్తవ రాజ్యాన్ని జయించినా, వారి ఈ విజయానికి పరాజితుల సహాయ సహకారాలే ప్రధానపాత్ర వహించాయని చరిత్ర మనకు తెలుపుతోంది. క్రైస్తవ రాజ్యాల పతనం, ఓటమికి గల కారణాలలో ఒక కారణం ఏమిటంటే ఆ దేశపాలకులు, అరబ్బు విజేతలకన్నా అత్యధికంగా ప్రజల్ని పీడించి, అణచి ఉంచేవారు. (అందుకని) ముహమ్మద్ (స) అనుచరుల్ని డెమాస్కస్ ప్రజలే స్వాగతించారు. ఆ కాలపు ఈజిప్ట్ దేశసైన్యాలు స్వయంగానే ముందుకెళ్ళి, అరబ్బు విజేతలకు తమ దేశాన్ని అప్పగించాయి. క్రైస్తవులయిన బర్బరులే ఆఫ్రికాను జయించటానికి వీరికి తోడ్పడ్డారు. ఈ దేశాలన్నీ కూడా కాన్‌స్టాంటినోపుల్ ప్రభుత్వం పట్ల గల ద్వేషం కారణంగా, ముహమ్మద్ (స) సైన్యాలకు తమకు తామై సమర్పించుకున్నారు.'' (The History of By Zentyine. by George Finley. Ouoted in the Historical Role of Islam. By. M.N. Ray)

రుమేనియాకు చెందిన ఒక విద్వాంసి, రాజకీయ నాయకుడు అయిన కోన్‌స్టన్ వీర్‌జల్ పశ్చిమం వారినుద్దేశించి రాసిన 'ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ - ఆయన్ను పునఃసమీక్షించాల్సి ఉంది' అనే గ్రంథంలో ఇలా పేర్కొంటున్నాడు.

“ప్రపంచంలోని ఏ ఇతర ధార్మిక వ్యవస్థాపకుడు కూడా, ఇస్లామీయ ప్రవక్తలాగా, ఇతర ధర్మాలతో రాజీపడలేదు. ఇతర ధర్మాలను విశ్వసించేవారు, ఇస్లాం సంరక్షణలో మదీనా నగరంలో స్వతంత్రంగా, సుఖశాంతులతో జీవించటానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. వారినెవ్వరూ కూడా అడ్డగించరని, బాధించరని అభయమిచ్చారు. స్వతంత్రం, సమానత్వపు భావనలపై నిర్మింపబడిన తన ధర్మానికి, ఏ ఇతర ధర్మాలతో ఎలాంటి ప్రమాదం లేదని, తన ధర్మం ఇతర ధర్మాలపై ప్రభావితమవటం సాధ్యమేగాని, ఇతర ధర్మాలు తన ధర్మంపై ప్రభావితం కావటం అసంభవమనే విషయం ఆయన (స) గారికి బాగా తెలుసు.”

భారతదేశంలో కమ్యూనిజానికి పునాది వేసిన అగ్రేసరుడు, మెక్సికో లాంటి అనేక దేశాల్లో కమ్యూనిజపు పునాదుల్ని గట్టి పరిచినవాడు, (ఇంటర్నేషన్) కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ బాడీకి సభ్యునిగా పని చేసిన ప్రఖ్యాత భారతీయుడు ఎం.ఎన్.రాయ్, “The Historical Role of Islam అనే గ్రంథంలో తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తపరిచారు.

“వారు క్రైస్తవులయినా, ముస్లింలయినా లేక ఇంకెవరయినా సరే, సమకాలీనులైనా లేక ఆధునిక యుగానికి చెందిన వారైనా సరే, ప్రఖ్యాత చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబ్బన్‌తో సహా, ప్రామాణికులైన చరిత్రకారులందరూ మహనీయ ముహమ్మద్ (స) తన క్రైస్తవ ప్రజలతో అత్యంత మేలుగా ప్రవర్తించారని, నిండు హృదయంతో వారి ధనమాన ప్రాణాలకు రక్షణ కల్పించారని, వారిని వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ నిచ్చారని, వారి వర్తక సామగ్రిని సంరక్షించారని, తమకు తోచిన రీతిలో ఆరాధన చేసుకోవటానికి వారికి స్వేచ్ఛ నిచ్చారని నిరూపించారు. పరమత సహనం, ఓర్పు నిగ్రహాలకు సంబంధించి శ్లాఘించదగిన ఈ సిద్ధాంతంపై ప్రవక్త మహనీయుల (స) ఖలీఫాలే కాక (ఆ తరువాత వచ్చిన) సర్వ అరబ్బు పరిపాలకులు ఆచరించి చూపారు.”

కాల్పనిక దుష్ప్రచారానికి ప్రభావితులై, ఆ తరువాత వాస్తవం తెలుసుకొని తమ తప్పుడు అభిప్రాయాలను మార్చుకున్న రెండు సంఘటనలను



స్వర్గీయ మౌలానా అబూ ముహమ్మద్ ఇమాముద్దీన్ రాంనగరి తమ పుస్తకం ‘ఇస్లామ్-మే-బలాత్ ధర్మ్ పరివర్తన్ నహీం’లో ఇలా వివరించారు:

“మా రాంనగర్‌లోనే సనాతన ధర్మాన్ని అవలంభించే మా మిత్రుడు ఒకరున్నారు. ఆయన ఆంగ్లంలో బి.ఏ. సంస్కృతంలో ఉన్నత శ్రేణికి చెందిన విద్వాంసుడు, అనేక గ్రంథాల రచయిత, పురాణాల అనువాదకుడు. స్వయం సేవక్ సంఘ్ భావనలు కలిగినవాడు. ఒకసారి ఆయన లక్నో నుండి వెలువడే ‘రాష్ట్ర-ధర్మ్’ అనే మాసపత్రికలో ఇస్లాంకు వ్యతిరేకంగా ప్రచు రించబడిన వ్యాసం ఒకటి చదివి వినిపించారు. అందులో పవిత్ర ఖుర్‌ఆన్ లోని ఈ క్రింది ఆయత్‌ను సూచించడం జరిగింది.

> **“ముస్లిములకు వ్యతిరేకులైన ముస్లిమేతరుల్ని ముస్లింలు తమ సంరక్షకులుగా, మిత్రులుగా చేసుకోరాదు.” (ఖుర్‌ఆన్)**

ఈ ఆయత్ మా మిత్రుని భావనలను ఎంతోగాయపర్చినట్లుంది. దాని అనువాదాన్ని నాకు వినిపించి, ‘అనువాదం సరిగానే ఉందా?’ అని ఆయన నన్నడిగారు. ‘అనువాదమైతే సరిగానే ఉంది. కాని ఈ వ్యాసకర్త దాని ఏ భావన్నైతే తెలిపారో, దాని ఉద్దేశ్యం మాత్రం అదికాదు. యుద్ధ పరిస్థితి ఉత్పన్నమై మదీనాపై ముట్టడికి సన్నాహాలు జరుగుతున్న సమయంలో మక్కా అవిశ్వాసులను ఉద్దేశించి ఈ ఆయత్‌లు అవతరించాయి. మక్కా నగరాన్ని, తమ ఇళ్ళను త్యాగంచేసి, మదీనా వలస వచ్చేసిన ముస్లింల సంబంధీకులు ఇంకొందరు ఇంకా మక్కా నగరంలోనే ఉండిపోయారు. మదీనా వచ్చేసిన ఈ ముస్లింలను సంబోధిస్తూ పైఆయత్ ద్వారా ఇలా ఆదేశించటం జరిగింది. అంతేకాక నేను ఆ మిత్రునికి, మౌలానా ఆజాద్‌గారి తర్జుమానుల్ ఖుర్‌ఆన్ నుండి ఈ ఆయత్ భావార్థాన్ని చదివి వినిపించాను. అదిలా ఉంది:

“ఇకిప్పుడు నిర్ణయాత్మక సమయం వచ్చేసింది. అందుకని ఇస్లాం అనుయాయుల్ని సంబోధిస్తూ వారిక కార్యాన్ముఖులు కావాలని, ఎలాంటి బలహీనతకు తావివ్వరాదని హెచ్చరించడం జరిగింది. ఈ విషయంలో అన్నిటి కన్నా ప్రముఖ అంశం ఏమిటంటే, సామూహిక ప్రయోజనాలపై వ్యక్తిగత

ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లోను ప్రాధాన్యత ఇవ్వరాదని ఆదేశించడం జరిగింది. ఇంకా శత్రువుల్ని తమ సహాయకులుగా, మిత్రులుగా చేసుకోరాదని కూడా హెచ్చరించటం జరిగింది.

రణభేరి మ్రోగింది. శత్రువులు, మిత్రులు రెండు వేర్వేరు వరుసల్లో నిలబడ్డారు. అందుకని ప్రతివ్యక్తి తనకు నచ్చిన ఏదో ఒక వర్గాన్ని ఎన్నుకోవాలి. అలా ఎంపిక చేసుకున్న తరువాత ఆ వైపుకే వెళ్ళిపోవాలి. తానొక పక్షంలో నిలబడి ఎదురు పక్షం వారితో గుప్త సంబంధాలు ఏర్పరుచుకోవటం చెల్లదు.''

*(తర్జుమానుల్ ఖుర్ఆన్, భాగం-1, పేజి 318)*

ఈ వ్యాఖ్యానం వినిపించిన తరువాత, పైన ఇంతకు ముందే మనం అధ్యయనం చేసిన బఖర అధ్యాయపు ఆయత్‌లను కూడా చూపించాను. ఆ తరువాత ఘోరమైన యుద్ధానికి సన్నద్ధం కావాలని ఆదేశిస్తూ వచ్చిన ఈ ఆయత్‌లను చూపిస్తూ, ఒక్కొక్క వాక్యం అర్థాన్ని, భావాన్ని అర్థం చేయించి నప్పుడు, స్వయంసేవక్ సంఘ్‌తో సంబంధంతోపాటే హిందుత్వ భావనలు కూడా కలిగివున్న నా మిత్రుడు, ఈ ఆయత్‌ల సందర్భం, భావం, అర్థం చేసుకొని ఎంతగా ప్రభావితుడయ్యాడంటే, యుద్ధానికి సంబంధించి అవతరించిన ఇతర ఆయత్‌లను ఆయనకు చూపిద్దామనుకుంటే ఆయన నన్ను వారిస్తూ, 'అవసరం లేదు! నేను అర్థం చేసుకున్నాను. ఇవి ఆ కాలపు విరోధుల గురించి వచ్చిన ఆయత్‌లు మాత్రమే' అని సంతృప్తి చెందారు.

రెండవ సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను దివంగత మౌలానా అబూ ముహమ్మద్ ఇమాముద్దీన్ ఇలా వివరించారు:

ఆయనగారి హిందీ చిరుపుస్తకాన్ని *(ఇస్లాంమే-బలాత్ ధర్మ్ పరివర్తన్ నహీఁ)* అమారతే షరయ్య, బీహార్, ఒరిస్సా వారు కూడా ప్రచురించారు. ఆ పుస్తక ప్రచురణకు పూర్వం అమారతే షరయ్యా వారు, ఆ నగరంలో వారికి సత్సంబంధాలున్న ప్రముఖ హిందూ సోదరులకు దాన్ని చూపించారు. వారు



దీన్ని ప్రశంసిస్తూ, 'దీన్ని తప్పక ప్రచురించండి. ఏ ఉద్దేశంతో ఇది రాయ బడిందో, అందులో ఇది కృతార్థమయింది'' అంటూ ప్రోత్సహించారని తెలిపారు.

దీనివల్ల న్యాయశీలురు, నిర్మల హృదయులైన హిందూసోదరులకు నిజమేమిటో, వాస్తవమేమిటో, సందర్భమేమిటో, కళ్ళకు కట్టినట్లు చూపిస్తే, హృదయానికి హత్తుకునేలా వివరిస్తే, వారు తమ పాత అభిప్రాయాలను ఏమైనా వుంటే అవగాహన లేమివల్ల ఏర్పడిన అపార్థాలను తొలగించు కోవటంలో ఏమాత్రం వెనుకాడరు.

అందుకని ఈ పుస్తకం చిన్నదైనప్పటికీ, దైవకృపవల్ల వారి అపోహలను, అపార్థాలను దూరపరచడంలో తప్పకుండా కృతార్థమవుతుందని ఆశిస్తున్నాము.

0 0 0

# 3. ధార్మిక స్వాతంత్ర్యము

దైవప్రవక్త ముహమ్మద్ (స), ఆయన ఉత్తరాధికారులు అయిన ఖలీఫాల కాలంలో ముస్లిమేతరులతో అనేక సంధులు, శాంతి ఒప్పందాలు జరిగాయి. వారికి సంధి ఒప్పంద పత్రాలు రాసి ఇవ్వడమూ జరిగింది. వాటిలో వారికి ఇవ్వబడిన ధార్మిక స్వాతంత్ర్యం ఎలాంటిదో మేమిక్కడ ప్రస్తావిస్తున్నాము.

హిజ్రి శకం 9లో నజరాన్ ప్రాంతానికి చెందిన క్రైస్తవుల ప్రతినిధి వర్గం మదీనా నగరానికి వచ్చినప్పుడు ప్రవక్త మహనీయులు వారిని తమ ఆచారం ప్రకారం ఆరాధన, ఇతర ధార్మిక విధులు తమ స్వంత మస్జిద్ అయిన 'మస్జిద్- ఎ-నబవి'లోనే నెరవేర్చుకోవటానికి అనుమతించారు. ఆ తరువాత వారితో చేసుకున్న ఒప్పందాన్ని చూసి, సర్ విలియం మ్యూయెర్ లాంటి ఎంతో దురుసయిన ఇస్లాం విమర్శకుడు, చరిత్రకారుడు కూడా శ్లాఘించకుండా ఉండలేకపోయాడు. ఆయన ఇలా రాస్తున్నాడు:

"ప్రవక్తగారు బిషప్పులకు, పాదరీలకు, సన్యాసులకు రాతపూర్వక హామీనిస్తూ వారి చర్చీలు, మఠాలు మొదలైన వాటిలోని ప్రతి చిన్నాపెద్ద వస్తువు ఇప్పుడెలా ఉందో, ఇక ముందు కూడా అలాగే ఉంటుందని హామీ ఇచ్చారు. ఏ బిషప్పు కూడా తన హోదా నుండి, ఏ సన్యాసి కూడా తన మఠం నుండి, ఏ ఒక్క పాదరీ కూడా తన స్థానం నుండి తొలగించబడడని దైవప్రవక్త



గారు ప్రతిజ్ఞ చేశారు. అంతేకాక వారి అధికారాల్లో, హక్కుల్లో, కార్యాచరణల్లో ఎలాంటి మార్పు చేయబడదని హామీ ఇచ్చారు. వారు శాంతి, సద్భావన మరియు సత్యంపై ఉన్నంతకాలం వారిపట్ల ఎలాంటి ఒత్తిడి, బలత్కారం జరుగదు. వారు కూడా ఎవరిపై ఎలాంటి ఒత్తిడి, బలవంతం చేయకూడదు."

(Life of Mohammad, By Sir William Muer P.158)

దైవప్రవక్త (స) ప్రసాదించిన రాయితీలను పేర్కొంటూ, "స్పిరిట్ ఆఫ్ ఇస్లాం" రచయిత తెలిపిన వాస్తవాలను శ్రీ చూనీలాల్ ఆనంద్, ఎం.ఏ., 1924లో మార్టిన్ హిస్టారికల్ సొసైటీలో 'మొగలుల పరిపాలనలో ధార్మిక హింస కథనం' అనే మకుటంతో ఇచ్చిన ఉపన్యాసంలో ఇలా పేర్కొన్నారు:

"క్రైస్తవులకు తమ క్రైస్తవ రాజుల పరిపాలనలో కూడా లభించని రాయితీలను ప్రవక్త మహనీయులు ప్రసాదించారు. ఏ ముస్లిం అయిన ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే, అతను దైవాదేశాలను ఉల్లంఘించినట్లుగా, తన స్వధర్మాన్ని కించపరిచినట్లుగా భావించబడుతుందని బాహాటంగా ప్రకటించారు. ఆయనగారు స్వయంగా కూడా ఈ ఆదేశాలను ఆచరించి చూపారు. తన అనుయాయులను క్రైస్తవులకు, ఇతర ముస్లిమేతరులకు రక్షణ ఇవ్వాలని, యూదుల గృహాలను రక్షించాలని, వారిని అన్నిరకాల కష్టనష్టాల నుండి కాపాడాలని ఆదేశించారు. అంతేకాక వారిపై అధర్మమైన టాక్సులను విధించడం జరుగరాదని తెలిపారు. ఏ బిషప్పును అతని మఠం నుండి తొలగించరాదని, ఏ యాత్రికుడ్ని దర్శనం నుండి ఆపరాదని, మస్జిద్‌లు మరియు ముస్లింల నివాస గృహాలు నిర్మించుకోవటానికి ఏ చర్చినీ ధ్వంసం చేయరాదని ఆదేశించారు. ముస్లింలను వివాహమాడిన క్రైస్తవ స్త్రీలను వారి స్వధర్మాన్ని ఆచరించటానికి అనుమతించాలని, ఎలాంటి హింసా-దౌర్జన్యాలకు పాల్పడరాదని హితబోధ చేశారు. ఒకవేళ క్రైస్తవులకు తమ చర్చీలు, మఠాలు మరమ్మత్తు చేసుకునే అవసరం ఏర్పడితే, లేక వారి ధార్మిక విషయంలో ఇంకేదైనా అవసరం వస్తే, ముస్లింలు వారికి సహకరించాలని కూడా ఆదేశించారు."

"ముహమ్మద్ జీవితం" అనే మకుటంతో రాసిన ఒక వ్యాసంలో ప్రఖ్యాత విద్వాంసుడు శ్రీసుందర్‌లాల్‌జీ ఇలా పేర్కొంటున్నారు:

"రెండవ విషయం ఏమిటంటే రాజ్యాధినేతగా ముహమ్మద్ గారు ముస్లిమేతరులకు, చివరికి విగ్రహారాధకులకు సయితం తన ప్రభుత్వంలో ఉండి, తమ మతాచారాలను పాటించుకోవటానికి సంపూర్ణ స్వేచ్ఛ ప్రసాదించారు. వారి ఆరాధనాలయాలకు భద్రత చేకూర్చడం ప్రతి ముస్లింకు విధిగా చేశారు. "లా ఇక్రాహ ఫిద్దీన్" (ధర్మావలంబనలో బలాత్కారం లేదు) అనే ఆయత్ మదీనాలో అవతరించిన ఆయత్. ముహమ్మద్ గారి సర్వజీవితం ఈ ఆయత్‌కు అద్దం పడుతుంది. దీనికి సాక్ష్యంగా క్రైస్తవులు, యూదులు, ఇంకా ఇతర మతాల వారితో ముహమ్మద్ గారు చేసుకున్న ఒప్పందాల నకళ్ళు నేటికీ ఉన్నాయి." *(విశాల్‌భారత్ పత్రిక, కలకత్తా, నవంబర్ 1933)*

ఇంగ్లాండ్‌కు చెందిన ప్రసిద్ధ విద్వాంసుడు మరియు రచయిత అయిన డాక్టర్ ఇ.ఎఫ్. క్రాస్‌వెల్, తాను రాసిన ఒక వ్యాసంలో ఇలా పేర్కొన్నారు.

"మానవ జీవితంలో 'యుద్ధం' కూడా ఒక ప్రముఖ విభాగంగా పరిగణింపబడింది. అయితే ఈ విభాగంలో నైతిక ఆదర్శాలను స్థాపించి ఆచరించి చూపటం అత్యంత కఠినమైన కార్యం. కాని ఇస్లామీయ ధర్మం, మానవ జీవితంలోని ఈ రంగంలో కూడా మహోన్నతమైన నైతిక విలువల్ని ప్రతిపాదించింది. కేవలం ప్రతిపాదించటమే కాదు, వ్యవహారికంగాను, ఆచరణాత్మకంగాను ఈ నైతిక విలువల్ని ముస్లింలు అనుసరిస్తూపోయారు.

దురాక్రమణకు సంబంధించిన అన్ని రకాల యుద్ధాల్ని ఇస్లాం నిషేధించింది. ఇంకా ముస్లింలకు తమ ఆత్మ రక్షణార్థం యుద్ధం చేయటానికి మాత్రమే అనుమతించింది. అయితే ఇలాంటి యుద్ధంలో కూడా నైతిక విలువల్ని, మానవీయతను ఉల్లంఘించకుండా ఉండాలని కఠినంగా ఆదేశించింది. ఇంకా ముస్లింలతో పోరాడే వారిపైనే, వారు పరాజితులైన తరువాత కూడా ఆయుధాలు పడేయని వారిపైన మాత్రమే చేయి లేపటానికి అనుమతించింది. దీంతోపాటే మానవ జీవితాలకు పనికివచ్చే వస్తు సామగ్రిని కూడా నష్టపరచరాదని ఆదేశించింది.



యుద్ధానికి సంబంధించి ఏ ఉన్నత నైతిక ప్రమాణాలనైతే ఇస్లాం స్థాపించిందో, ప్రపంచంలోని ఏ ఇతర జాతి ఈ ఆదర్శాన్ని ప్రదర్శించజాలదు. సారాంశం ఏమిటంటే ఇస్లాంను ఏ కోణంతో పరికించినా అది ఉన్నతోన్నత నైతిక ప్రమాణాలతో పరిపూర్ణమైన సిద్ధాంతంగా కనబడుతుంది. దాని బోధనలోని ఒక విశిష్ట గుణమేమిటంటే దానివల్ల ముస్లింలు, ముస్లిమేతరులు-ఇద్దరూ సమానంగా లాభపడగలుగుతారు."

*(దీన్‌దునియా మాసపత్రిక, ఢిల్లీ, జూన్ 1960)*

రెండవ ఖలీఫా అయిన ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో జెరూసలెం జయింపబడినప్పుడు, జరూసలెం వాసులకు రాసి ఇవ్వబడిన హామీ పత్రంలో ఇలావుంది:

"జెరూసలెంలో నివసిస్తున్న ముస్లిమేతర ప్రజలకు వారి ధన, మాన, ప్రాణాలు, సంతానాల విషయంలో రక్షణ ఇవ్వబడుచున్నది. వారి ఆరాధనాలయాలు, శిలువలు, వారి ఆధీనంలోనున్న సర్వవస్తువులకు రక్షణ కల్పించబడుతుందని గ్యారంటీ తీసుకోవటం జరిగింది. వారి భూముల్లో, వారి ధర్మంలో ఎలాంటి జోక్యం చేసుకోబడదు. వారి చర్చీలను ధ్వంసం చేయటం గాని, లేక ఇతరత్రా నష్టపరచడంగాని జరుగదు. వాటికివ్వబడిన దానాలు, వాటి గౌరవాన్ని యధాతథంగా కాపాడటం జరుగుతుంది. జెరూసలెం వాసులకు తమ ధార్మిక విధి నిర్వహణలో పరిపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్రాలు ప్రసాదించబడ్డాయి. వారిపై ఎలాంటి హింసా-దౌర్జన్యాలు జరుపబడవు."

(The Eclips of christianiy in Aisa. By Laurance E. Brown. P.39)

హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఆయన సమక్షంలోనే ఏలియా (సిరియా) వాసులకు ఈ క్రింద పేర్కొనిన శాంతి పత్రాన్ని రాయించి ఇవ్వడం జరిగింది.

"ఈశ్వర సేవకుడు, ముస్లింల అధినేత (ఖలీఫా) అయిన ఉమర్ ద్వారా ఈలియా వాసులకు ఇవ్వబడిన రక్షణ పత్రమిది. వారి ధన మాన, ప్రాణాలకు, ఆరాధనాలయాలకు, శిలువలకు, ఆరోగ్యవంతులు, రోగులు

ఇంకా వారి ధర్మాన్ని అనుసరించేవారందరికీ ఇది వర్తిస్తుంది. వారి ఆరాధనాలయాల్లో నివాస మేర్పరుచుకోవడంగాని, వాటిని ధ్వంసం చేయడంగాని జరుగదు. వాటి ప్రాంగణాలకు ఎలాంటి నష్టం, హాని కూడా జరుగదు. వారి శిలువల్లో, వారి వస్తువాహనాదుల్లో ఎలాంటి లోపం జరుగదు. ఇంకా వారి ధర్మం విషయంలో వారిపై ఎలాంటి ఒత్తిడిగాని బలాత్కారం కాని జరుగదు.''

*(అల్ ఫారూఖ్ - రచన: అల్లామ షుబ్లి నొమాని)*

ఇది ఏదో ఒక సందర్భంలో చూపించిన ప్రత్యేక ఉదారత లేక సహనత్వం కాదు. ధార్మిక స్వాతంత్ర్యం, ధార్మిక రక్షణ అనేది ఇస్లామీయ పరిపాలనా విధానంలోని శాశ్వత నీతి. ఖుర్ఆన్‌లోని లా ఇక్రాహ ఫిద్దీన్ (ధర్మావలంబనలో బలాత్కారం లేదు) అనే దైవాదేశం దీనికి ఆధారం. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో అమ్ర్-బిన్-ఆస్ (రజి) ఈజిప్ట్ దేశాన్ని జయించినప్పుడు, యుద్ధంలో అనేక మంది సైనికులు ఖైదీలుగా పట్టుబడ్డారు. వారి విషయంలో ఎలా వ్యవహరించాలని అమ్ర్ -బిన్ -ఆస్ (రజి) ఒక లేఖ రాస్తూ ఉమర్ (రజి)ను అడిగారు. 'ఈ బందీలకు వారి ఇష్టమైతే ఇస్లాం స్వీకరించటానికి లేదా జిజ్‌యాను చెల్లించి, వారివారి ధర్మాలపై ఉండటానికి అధికారమివ్వాలని'' ఉమర్ (రజి) ప్రత్యుత్తరం ఇచ్చి పంపించారు.

*(అల్‌ఫారూఖ్-అల్లామ షుబ్లి)*

రెండవ ఖలీఫా అయిన ఉమర్ (రజి)కు ఒక క్రైస్తవ బానిస సేవకునిగా ఉంటుండేవాడు. ఒకసారి ఆయన ఈ బానిసను ఇస్లాం స్వీకరించమని కోరారు. అందుకతను నిరాకరించాడు. అప్పుడాయన అరబ్బు, సిరియా, ఇరాన్, ఈజిప్ట్ దేశాలకు పరిపాలకుడై ఉన్నప్పటికీ, తన బానిస సమాధానం విని 'లా ఇక్రాహ ఫిద్దీన్'' (ధర్మావలంబనలో బలాత్కారం లేదు) అని మాత్రమే అంటూ ఊరుకున్నారు. అంతేకాక ఈ విషయంలో ఎలాంటి అసంతృప్తిని వ్యక్తపరచలేదు. తన అవసానకాలం సమీపిస్తుండగా, తన ఈ బానిసను



పిలిపించి, ఆలింగనం చేసుకుంటూ, అతన్ని బానిసత్వం నుండి విముక్తి కలిగించారు కూడా.

ప్రముఖ విద్వాంసుడు, సామ్యవాదాన్ని భారతదేశంలో పరిచయం చేసిన తొలి నాయకుల్లో అగ్రగణ్యుడైన శ్రీ యం.ఎన్. రాయ్, జెరూసలెంలో క్రైస్తవుల విజయ ప్రవేశాన్ని వర్ణిస్తూ రాసిన ఒక ఆంగ్ల వ్యాసంలో ఈ క్రింది విధంగా చెబుతున్నారు. ఈ వ్యాసాన్ని ఢిల్లీ నుండి విలువడే 'దావత్' పత్రిక తన 13వ సెప్టెంబర్, 1983వ సంచికలో ప్రచురించింది.

''జెరూసలెం క్రైస్తవులకు ఒక పుణ్య క్షేత్రం, సందర్శనా స్థలంగా గుర్తించబడుతుంది. ముస్లింలే గనుక మత పక్షపాతం, సంకుచిత స్వభావులై వుంటే, ఐరోపా , ఆఫ్రికా నుండి వచ్చే ఈ క్రైస్తవ యాత్రికుల్ని అక్కడికి రాకుండా అడ్డుకొని ఉండేవారు. కాని వారలా చేయలేదు. ఆ కాలపు చరిత్ర అధ్యయనం చేస్తే, ఈ సందర్శకుల సంఖ్య బాగా పెరిగిపోయినట్లు తెలుస్తుంది. ఇంకా ముస్లింలు ఈ యాత్రికుల విశ్రాంతికి, రక్షణకు అత్యంతగా ప్రాధాన్యతనిచ్చేవారు. కాని దాదాపు ఆరువందల సంవత్సరాల తరువాత ఇదే జెరూసలెం ఓ చిన్న వ్యవధి కోసం ఐరోపా క్రైస్తవుల ఆధీనంలోకి వచ్చినప్పుడు Decline and Fall of Roman Empire అనే చరిత్రపుటలు తెలుపేదేమిటి? జెరూసలెంను జయించిన తరువాత క్రైస్తవ మత ధ్వజవాహకులు, శిలువ వీరులు ఒక ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం ప్రజల, ప్రభుత్వ ఆస్తుల్ని దోపిడీ చేస్తూ ఏ సైనికుని చేతికి ఏ వస్తువు అందుతుందో అది అతని ఆస్తిగా పరిగణింపబడుతుంది. అందులో వేరొకరికి జోక్యం చేసుకునే అధికారముండదు. అంటే దోచుకోవటానికి పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వబడిందన్నమాట.

అంతేకాక ఈ మార్గభ్రష్టులైన విజేతలు తమ ఆకాశ తండ్రిని సంతృప్తి పరచటానికి మానవ బలి దానాలను సమర్పించారు. అందులో వయస్సు, లింగ బేధాన్ని కూడా పాటించలేదు. మూడు రోజుల వరకు ఘోరమైన ఈ

మానవ సంహారం జరుగుతునే ఉంది. దాదాపు డెబ్భై వేలమంది ముస్లింలను సంహరించి, అమాయకులైన యూదుల్ని వారి ఆరాధనాలయాల్లో సజీవంగా కాల్చి చంపిన తరువాత కూడా నగరంలో మిగిలిపోయిన వేలాది మంది ప్రజల్ని బానిసలుగా చేసుకున్నారు. వీరి ఈ ప్రవర్తనను, ముస్లింల ప్రవర్తనతో పోల్చిచూసినప్పుడు, ముస్లింల సహనత్వం, విశాల దృక్పథం, శాంతి సామరస్యాలు, వారిజాతి ఔన్నత్యం మన హృదయాలను ఎంతో చూరగొంటుంది."

మధ్యప్రాచ్యం నుండి ఇస్లామీయ ధర్మాన్ని ఊడబెరకడానికి ఐరోపా క్రైస్తవులు, సర్వసన్నాహాలు చేసుకొని, గొప్ప సైన్యాలతో ముస్లింలపై విరుచుకుపడ్డారు. చరిత్రలో ఇవి "క్రూసేడ్ యుద్ధాలు"గా ప్రఖ్యాతిగాంచాయి. ఆ యుద్ధాల్లో క్రైస్తవులు జరిపిన ఘోరమానవ హత్యాకాండను చరిత్రకారులు ఇలా వర్ణిస్తున్నారు:

"తమ ఆధిపత్య కాలంలో క్రైస్తవులు, ముస్లింల రక్తాన్ని ఎంతగా చిందించారంటే 'అక్సా మసీదు'లో మోకాలు లోతు రక్తం ప్రవహించసాగింది. ఈ హింసా-దౌర్జన్యాలు, కిరాతకాలు 1094, జులై 19 వరకు కొనసాగాయి. ఖైదీలందరూ వధించబడ్డారు. కనబడిన ప్రతి ముస్లింలను బురుజుల పైనుండి, కోటలపై నుండి కందకాల్లో విసిరిపారేశారు. సజీవంగా కాల్చి చంపేశారు. కేవలం ఆ ఒక్క నగరంలోనే డెబ్భై వేల ముస్లింలు వధించబడ్డారు."

*(తారీఖుల్-ఖులఫా)*

ముస్లిం చరిత్రకారులే కాదు, స్వయంగా క్రైస్తవ చరిత్రకారులు కూడా ఈ మానవ సంహారాన్ని ధృవీకరించారు. జెరూసలెం జయింపబడిన సందర్భంలో, విజేత సేనానులైన డైమండ్, గాడ్‌ఫ్రీలు ఈ విజయం గురించి 1095లో తమ లేఖల్లో రాసిన ఈ వాక్యాలు గమనార్హం.

"జెరూసలెంలో మాకు పట్టుబడిన, కనిపించిన ఈ శత్రువుల (ముస్లింల) పట్ల మేమెలా వ్యవహరించామో మీరు తెలుసుకోదలిచారా?



అయితే వినండి. అపవిత్రమైన ఈ ముస్లింల రక్తంలో మా అశ్వాల మోకాళ్లు మునుగుతుండగా మేము సొలమన్ ప్రధాన చర్చీకి వెళ్ళామని తెలిపితే పరిస్థితి మీకు చక్కగా అర్థమవుతుందనుకుంటాను."

*(క్రూసేడ్‌ల చరిత్ర. రచన మచాడ్ వాల్యూం.3, పేజి 362)*

ఈ క్రూరత్వాలకు భిన్నంగా ఇస్లామీయ ధర్మం ప్రతిపాదించిన శాంతి-సామరస్యాలు, ఓర్పు, పరమత సహనం లాంటి సిద్ధాంతాలు, వాటిపై ఆచరించిన తీరును చూసి విస్తుబోయిన ఫ్రెంచ్ చరిత్రకారుడు డాక్టర్ గిస్టావలి బాన్ తన విశ్వప్రఖ్యాత గ్రంథం 'Arab Cultureలో ఇలా ఉల్లేఖించారు.

"ముస్లింలు ఎల్లప్పుడూ పరాజిత జాతుల్ని వారి ధార్మిక విషయాల్లో స్వేచ్ఛా-స్వాతంత్రాల్ని ప్రసాదించేవారు."

ఈ విషయాన్నే ఇంకొక యూరోపియన్ చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబ్బన్ ఇలా విశ్లేషిస్తున్నాడు.

"ఇస్లామీయ ధర్మం, ఇతరుల ధార్మిక విషయాల్లో జోక్యం చేసుకోలేదు. ఎవరినీ హింసించలేదు, పరమతస్తుల్ని శిక్షించటానికి ఏ ధార్మిక న్యాయస్థానాల్ని ఏర్పాటు చేసివుండలేదు. ప్రజల ధర్మాన్ని బలవంతంగా ఒత్తిడితో మార్చాలని ఇస్లాం ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఇస్లాం అవలంభిస్తే మాత్రం విజేతలకు లభించిన హక్కులే వీరికీ లభించేవి. ప్రపంచ ఆరంభం నుండి ప్రవక్త ముహమ్మద్‌గారి కాలం వరకు ప్రతి విజేత, తన పరాజిత జాతులపై రుద్దుతూ వచ్చిన షరతుల నుండి, బంధనాల నుండి కూడా ఈ పరాజిత జాతులు విముక్తి పొందేవి."

మిస్టర్ గిబ్బన్ ముస్లిం కాదు, ఏ ముస్లిం దేశంలో జన్మించి ఉండనూ లేదు. కాని ఆయన నిష్పక్షపాతంగా, తెరిచిన కళ్ళతో ఇస్లాం అధ్యయనం చేశాడు. అందుకని ఆయన ఇస్లాంలోని ప్రత్యేకతల్ని ప్రశంసించకుండా

ఉండలేకపోయాడు. అంతేకాక పరాజిత జాతుల కోసం ఈ ధర్మాన్ని ఆయన ఒక కానుకగా, ఒక శుభోదయంగా భావిస్తున్నారు. అందుకనే ఆయనిలా రాస్తున్నారు.

"ఇస్లామీయ చరిత్రలోని ప్రతిపుటలో, ప్రతిదేశంలో, ఎక్కడైతే దానికి ఆధిక్యత (విజయం) లభించిందో, అక్కడ పరమతాల పట్ల అసహనం కనిపించదు. పైన మేము పేర్కొంటూ వచ్చిన సంఘటనల్ని చూసిన, పాలస్తీనాకు చెందిన ఒక క్రైస్తవ కవి, దాదాపు పన్నెండు వందల సంవత్సరాల తరువాత బాహాటంగా ఏమని ప్రకటించాడో తెలుసా? ఈ భూమండలంలో ఇతర మతాల వారికి సంపూర్ణ స్వేచ్ఛా-స్వాతంత్రాలు ప్రసాదించగలిగే జాతి, ఏదైనా ఉన్నదా అంటే అది కేవలం ముస్లిం జాతి ఒక్కటే."

(Decline and Fall of Roman Empire. By Advard Gibbon. P.158)

ముస్లింలు జెరూసలెంలో ప్రవేశించక ముందు అక్కడ రోమన్ చక్రవర్తి అయిన హెరాక్లియస్ పరిపాలన సాగుతుండేది. అతను పరమతస్తుల మీదనే కాక తన వర్గానికి చెందని క్రైస్తవులపై కూడా హింసా దౌర్జన్యాలు జరిపేవాడు. ఇతర మతాల వారి ముఖాలు కూడా చూడటానికి అతను ఇష్టపడేవాడు కాదు. పాలస్తీనా, ఈజిప్ట్, సిరియా దేశాల్నుండి యూదుల్ని తరిమివేయటానికి ఆదేశాలు జారీ చేశాడు. ఇంకా వారిపై రకరకాల దౌర్జన్యాలు జరుగుతూ ఉండేవి. తాను ఏ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాడో, ఆ వర్గం తప్ప మిగిలిన క్రైస్తవ వర్గాలు సైతం అతని హింసా దౌర్జన్యాలకు గురిఅవుతుండేవి.

ఈ సందర్భంలో యాఖూబి క్రైస్తవ వర్గపు బిషప్పు, ఇలా రాస్తున్నాడు:

"ఏ క్రైస్తవుడయినా, హెరాక్లియస్ వర్గాన్ని, పద్ధతిని అనుసరించ నిరాకరిస్తాడో, వాని ముక్కు, చెవులు కోసేయాలని, అతని ఇల్లు-వాకిలి దోచుకోవాలని అతను ఆదేశించాడు. ఆ వర్గ క్రైస్తవుల్ని అతను తన సమ్ముఖానికి రానిచ్చే



వాడు కాదు. అందుకని వారెక్కడ కూడా మొరపెట్టుకునే అవకాశమే లేదు. ఈ పరిస్థితుల్లో ప్రచుండుడైన దైవం, ఇస్మాయీల్ సంతతిలో ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని (దైవప్రవక్త-ముహమ్మద్) ఉద్భవింపజేశాడు. ఆయన ద్వారా మేము దౌర్జన్యకారులైన రోమనుల కిరాతకాల నుండి విముక్తి పొందాము. ఈ ప్రాంతాన్ని జయించిన తరువాత, ఈ ముస్లింలు, ఇక్కడి క్రైస్తవుల్లో ఏ ఒక్కరినీ ధార్మిక విషయంలో బాధించలేదు.... వీరి రాకవల్ల మేము రోమనుల దౌర్జన్యాల నుండి శాశ్వతంగా విముక్తి పొందాము. ఇక మేము ఈ అరబ్బులతో శాంతియుతమైన సుఖజీవనం సాగిస్తున్నాము."

*(Chroniaue de Michel Le syrian-II, P. 412,413)*

ఈజిప్ట్‌లోనూ ఇదే పరిస్థితి. రోమను అధికారులు పరమతస్థులైన ప్రజలతో అత్యంత కఠినంగా ప్రవర్తించేవారు. వారి పవిత్ర స్థలాలను కించపరచటం, వారి ఆరాధనాలయాలను ధ్వంసం చేయడం తమ హక్కనుకునేవారు. క్రీ.శ. పదమూడవ శతాబ్ద ఆరంభంలో వచ్చిన ఒక ఆర్మేనియన్ క్రైస్తవుడు 'అబూసాలెహ్' అప్పటి పరిస్థితులను ఇలా వర్ణిస్తున్నాడు.

"ఇది ఎలాంటి కాలమంటే, అప్పటి రోమన్ చక్రవర్తి, ప్రాచీన క్రైస్తవ ధర్మాన్ని ఆచరిస్తున్న వారిపై రకరకాలుగా హింసా దౌర్జన్యాలు జరిపేవాడు. వారిని బలాత్కారంగా తన వర్గంలో కలుపుకోవాలని తలంచేవాడు. అందుకని 'హెరాక్లియస్' మరియు 'మఖూఖస్' ద్వారా సద్వర్తనులైన క్రైస్తవులు ఎన్నో బాధల్ని అనుభవించారు. ఈ హింసా-దౌర్జన్యాలు పరాకాష్టకు చేరుకున్నప్పుడు, ఇస్మాయీల్ సంతతి నుండి ఒక జాతి ఉద్భవించి, ఈ రోమనుల గర్వాంధకారాలను అణిచివేసింది మరియు ఈజిప్ట్‌ను జయించి, రోమనుల దౌర్జన్యాల నుండి యాఖూబి వర్గ క్రైస్తవులకు విముక్తి కలిగించింది."

*(The Churches and Monastries of Egypt. P.30,31)*

పై సంఘటనల వల్ల ఇస్లాం ప్రసాదించిన సర్వ సామాన్యమైన ధార్మిక స్వాతంత్ర్యం, ముస్లిం పాలకుల అసామాన్యమైన సహనత్వం, ఇతర మతస్తుల పట్ల వారి ఓర్పు, సహనం ఇట్టే అర్థమైపోతుంది. వారు తమ ఆధిక్యత,

పరిపాలనా కాలంలో ఎవరి చర్చీలను, ఆరాధనాలయాల్ని ధ్వంసం చేయ లేదు, వాటి పూజారుల్ని బాధించలేదు, ధార్మిక విషయాల్లో వారి పట్ల ఎలాంటి ఒత్తిడి, బలాత్కారాలకు పాల్పడలేదు. ఈ విషయాన్నే ఇంకా నిరూపించటానికి, ఈ వాదనకు సుధృడపరచటానికి ఇక్కడ మేము కొన్ని వ్యక్తిగత లేఖలను సమర్పిస్తున్నాము. ఇవి మధ్యయుగం నాటి పాదరీలు, బిషప్పులు సమాన హోదాగల తమ మిత్రులకు రాసుకున్నవి అయినప్పటికీ, అవిప్పుడు ప్రెస్‌లోకి వచ్చి సర్వసామాన్యమైపోయాయి. వాటివల్ల ఇంకెన్నో విషయాలు అవగత మవుతాయి. మూడవ బిషప్పు అల్‌యసూబ్, పర్షియా (ఇరాన్)లోని దేవ్ ఉర్ద్‌షేర్ నివాసి అయిన సైమన్ పేర రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు.

"ఈ 'తై' లేక 'అరబ్బులు' ఎవరికైతే దైవం ఈ భూభాగపు ప్రభుత్వాన్ని ప్రసాదించాడో, ప్రస్తుతం మాతో సహజీవనం సాగిస్తున్న విషయం మీకు తెలిసే ఉంటుంది. కాని వారెప్పుడు కూడా మా ధర్మాన్ని కించపరచలేదు. దానికి భిన్నంగా వారు మా ధర్మాన్ని గౌరవిస్తారు. మా పాదరీలను, ఏసు ప్రభువును, ప్రవక్తల్ని అత్యంతగా గౌరవిస్తారు, ఇంకా మా చర్చీలకు, మఠాలకు వారు దానధర్మాలతో సత్కరిస్తారు." (క్రీ.శ. 660-664) (Eclips of Christianity Assenani-III, Part-II)

ఇదే విధంగా 1008లో లిస్బన్‌కు చెందిన మెట్రో పాలిటిన్ ఇలియాస్, ఇలా రాస్తున్నాడు.

"మేము వారి పాలితులం అయినా కాకపోయినా, వారు మాపట్ల ఎలా వ్యవహరించినా సరే, ముస్లింలకు విధేయులుగా ఉండటం, లేక వారిని ప్రేమించటం, ఇతర మతాలవారి విధేయత కన్నా అత్యధికంగా మమ్మల్ని ప్రభావితం చేస్తుందనేది మా విశ్వాసం. దీనికి కారణం ఏమిటంటే మమ్మల్ని సంరక్షించడం, మాపట్ల మేలుగా ప్రవర్తించడం వారు (ముస్లింలు) తమ



ధార్మికవిధిగా భావిస్తారు. ఎవరైనా పరమతస్తున్ని బాధిస్తే, ప్రళయం రోజు వారి ప్రవక్త, ఆ బాధితుని తరఫున ఈ ముస్లింకు వ్యతిరేకంగా దావా (వ్యాజ్యం) వేస్తారని వారి విశ్వాసం." *(Eclipse of Christianity Assenani-III, Part-II)*

ఇది వాస్తవం కూడాను. మహనీయ ముహమ్మద్ (స) జిమ్మీలకు (ముస్లిం రాజ్యంలో నివసిస్తున్న ముస్లిమేతరుల్ని జిమ్మీలంటారు) సంబంధించి ఇలా ఆదేశించి ఉన్నారు.

"జాగ్రత్త! ఏ వ్యక్తి (ముస్లిం) అయిన, ఒప్పందం చేసుకున్న వ్యక్తిపై (అనగా జిమ్మీపై) ఏ రకమైన దౌర్జన్యం చేసినా లేక అతని హక్కుల్లో లోపం రానిచ్చినా లేక అతని తాహతుకు మించి అతనిపై భారం మోపినా, లేక ఏ వస్తువైనా అతని అంగీకారం లేకుండా బలవంతంగా లాక్కున్నా, అటువంటి వ్యక్తి (ముస్లిం)కు వ్యతిరేకంగా ప్రళయం రోజున స్వయంగా నేనే వాదిగా నిలబడతాను." *(అబూదావూద్, కితాబుల్ జిహాద్)*

దీని అర్థం ఏమిటంటే ముస్లిమేతరులు, సంధి, శాంతి ఒప్పందం చేసుకొని, ఆ ఒప్పందంలో ఏ షరతులనైతే పరస్పరం ఆమోదించారో, వాటిలో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయటం అనగా వారిపై టాక్సులు పెంచటం, వారి భూముల్ని ఆక్రమించుకోవటం, వారి కట్టడాలను, ఇళ్ళను లాక్కోవటం, వారి ధార్మిక విషయాల్లో జోక్యం చేసుకోవటం, లేక వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగించడం- ఇత్యాదివి ఏ విధంగాను సమ్మతింపబడజాలవు. ఎవరైనా ఓ ముస్లిం అలా ప్రవర్తించి ఉంటే, ప్రళయం రోజు స్వయంగా ప్రవక్త మహనీయులు (స) ఆ ముస్లింకు వ్యతిరేకంగా దైవన్యాయస్థానంలో దావా వేస్తారు.

ఈ కారణంగానే సామాన్యంగా ముస్లిం పాలకులు ఎల్లప్పుడూ ముస్లిమేతరుల హక్కులు కాపాడటానికి ప్రయత్నిస్తుండేవారు. ఈ సత్ప్రవర్త

నను చూసే, Decline and Fall of Roman Empire రచయిత Advard Gibbon ఇలా రాశాడు:

“ప్రాచ్య (తూర్పు) క్రైస్తవులు ముస్లిం పరిపాలకుల రాజ్యాల్లో ఉండటానికి ఇష్టపడటానికి కారణం ఏమిటంటే వారికక్కడ సంపూర్ణ ధార్మిక స్వేచ్ఛా స్వాతంత్రాలుండేవి. దానికి భిన్నంగా పాశ్చాత్య క్రైస్తవ పాలకులు వారిని రోమన్ క్యాథలిక్కులుగానైనా మార్చేసేవారు, లేదంటే ఈ ప్రపంచం నుండే వారిని సమాప్తం చేసేవారు.”

**-సమాప్తం-**



చదవండి ఒక వారం
చదువుతారు ప్రతి వారం

సహజీవన భావనల పావురాయి
గీతురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad - 500 002.
Ph.: 24564583